



ఆడెనమ్మా! శివుడు.. పాడెనమ్మా! భవుడు

"మొలక మీసపు గట్టు, ముద్దు చందురుబొట్టు.. పులితోలు హొంబట్టు, జిలుగు వెన్నెల పట్టు.." అంటూ పుట్టపర్తి నారాయణాచార్యులు శివతాండవం కావ్యంలో వర్ణించిన దృశ్యం బుధవారం సాయంత్రం శ్రీకాళహస్తిలో సాక్షాత్కారమైంది. శివుడి ఢమరుకంపై తాండవమాడుతూ సూర్యుడు పడమట అస్తమించగా, తూరుపున పుట్టిన చంద్రుడు స్వర్ణమ్మలో అందాలు దిద్దుకుని, గోపురం మీదుగా ఆకాశానికెగసి, కన్నప్ప కొండమీద కొలువైన శివపార్వతుల సిగలో నగలాగ ఇమిడిన అపురూప దృశ్యాలు ఇవి. అంధ్రజ్యోతి స్టాఫ్ ఫోటోగ్రాఫర్ కెమెరాకు చిక్కాయి.





సబ్సిడీ రుణాలకు దరఖాస్తు గడువు పొడిగింపు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తులు చేసుకునే గడువును ప్రభుత్వం పొడిగించింది. గతంలో ఈనెల 12వ తేదీ వరకే దరఖాస్తుల స్వీకరణకు గడువిచ్చారు. అయితే కుల, ఆదాయం, నివేశ పత్రాల మంజూరులో రెవెన్యూశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ 'సబ్సిడీ రుణాలకు రెవెన్యూశాఖ మోకాలడ్డు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో బుధవారం కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ప్రభుత్వం ఈనెల 15వ తేదీ వరకు గడువు పొడిగించింది. ఈ మేరకు బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి తెలిపారు.

ఫైనల్ మెరిట్ జాబితా విడుదల

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో జాతీయ ఆరోగ్య మిషన్ పరిధిలో వివిధ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న ఉద్యోగాలకు సంబంధించిన ఫైనల్ మెరిట్ జాబితాను బుధవారం ఆన్‌లైన్‌లో విడుదల చేస్తున్నట్లు డీఎంహెచ్‌వో సుధారాణి ఒక ప్రకటనలో తెలిపారు. www.chittoor.ap.gov.in లో ఉంచడం జరిగిందని, జాబితా ఈనెల 14వ తేదీవరకు అందుబాటులో ఉంటుందన్నారు.

వాట్సాప్‌లోనే టికెట్ రిజర్వేషన్

- ఇక ఆర్టీసీలో సేవలు సులభతరం

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు త్వరిత గతిన మెరుగైన సేవలందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వాట్సాప్ పాలనను ప్రారంభించింది. వందలాది సేవలను వాట్సాప్ ద్వారానే పొందే అవకాశం కల్పించింది. ప్రయాణికులు 95523 00009 నెంబరుకు హాయ్ అని మెసేజ్ పంపాలి. తర్వాత ఏయే సేవలు అందుబాటులో ఉన్నాయో కనిపిస్తుంది. వాటిలో ఆర్టీసీ టికెట్ బుకింగ్ లేదా రద్దు అనే ఆప్షన్లు ఉంటాయి. టికెట్ బుక్ చేయడానికి ముందుగా అందులో బయల్దేరే ప్రదేశం, గమ్యస్థానం, డేట్ వంటి వివరాలు నమోదు చేయాలి. ఏయే సర్వీసులు అందుబాటులో ఉన్నాయి, సీట్ల వివరాలు చూపిస్తుంది. వీటిలో సీట్లు ఎంపిక చేసుకుని ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు చేయాలి. వెంటనే బుకింగ్ చేసుకున్న వ్యక్తి వాట్సాప్ నెంబరుకు టికెట్ వస్తుంది. చార్ట్‌లో రిజర్వేషన్ చేసుకున్న వారి వివరాలు నమోదవుతాయి.

వాట్సాప్‌తో వరసిద్ధుడి ఆలయ ఆర్జిత సేవలు

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధుడి ఆలయంలోని ఆర్జిత సేవలను ఇకపై వాట్సాప్ ద్వారా పొందవచ్చని ఈవో పెంచలకిషోర్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 95523 00009 నెంబర్‌కు హాయ్ అని మెసేజ్ చేయాలన్నారు. తర్వాత ఆలయంలో స్వామి దర్శనం, ఆర్జిత సేవలు, బుక్ చేసుకోవచ్చని సూచించారు. వీటితోపాటు ఆలయానికి విరాళాలను కూడా పంపవచ్చన్నారు.

నేడు కుప్పంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కుప్పం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో గురువారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే ఈ వేదికలో ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించి పరిష్కారాలు చూపుతామన్నారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు హాజరై అప్పటికప్పుడు పలు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.

మూడు ఇసుక యార్డులకు టెండర్ల ఆహ్వానం

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూడు ఇసుక యార్డులు ఏర్పాటుకు ప్రైవేటు వ్యక్తుల నుంచి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్, జిల్లా స్థాయి ఇసుక కమిటీ చైర్మన్ సుమిత్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఇసుక రీచ్‌లు లేకపోవడంతో అన్నమయ్య జిల్లా ఆర్.బుడుగుంటపల్లి నుంచి ఇసుకను నగరి, చిత్తూరు, పలమనేరు యార్డులకు తీసుకొచ్చి విక్రయించడానికి నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఇసుక లోడింగ్, రవాణా, అన్‌లోడింగ్, జీఎస్టీ.. అన్ని రుసుంలతో కలిపి టన్ను ఇసుకకు రూ.750 ధర నిర్ణయించినట్లు తెలియజేశారు. ఆసక్తి కలిగిన ప్రైవేటు వ్యక్తులు ఈనెల 20వ తేదీ లోపు టెండర్లను పుత్తూరు రోడ్డు చిత్తూరు ఇండస్ట్రియల్‌లోని జిల్లా గనులు, భూగర్భశాఖ అధికారి వారి కార్యాలయంలో సమర్పించాలన్నారు. సొంత రవాణా వాహనాలు, సొంత భూమి, లీజు భూమి(కనీసం ఒక ఎకరం) ఒప్పంద పత్రాలు కలిగిన కాంట్రాక్టర్లు సీల్ టెండర్లు దాఖలు చేయవచ్చన్నారు.

తగ్గిపోయిన చికెన్, గుడ్ల ధరలు

- పౌల్ట్రీ రంగంపై బర్డ్‌ఫ్లూ వదంతుల ప్రభావం
- ఆందోళన చెందుతున్న రైతులు,వ్యాపారులు

బర్డ్‌ఫ్లూ ప్రభావం పౌల్ట్రీ రంగానికి కీలకమైన ఉమ్మడి చిత్తూరు జిల్లా మీదా పడింది.చికెన్, గుడ్ల ధరలు తగ్గిపోయాయి. గోదావరి జిల్లాల్లో వేలాది కోళ్లు మృత్యువాత పడడంతో బర్డ్‌ఫ్లూ ఉందని భావించిన అధికారులు ఎగుమతులను ఆపివేయడంతో ప్రజల్లో భయం పట్టుకుంది. ఆ ప్రభావం చికెన్, గుడ్ల ధరల మీద పడింది.

– చిత్తూరు, ఆంధ్రజ్యోతి



ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సుమారు 1,600 పౌల్ట్రీ ఫారాలున్నాయి.వీటిలో 1,300 బ్రాయిలర్, 300 వరకు లేయర్ ఫారాలు కాగా దాదాపు 30వేల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్నారు. నెలకు 75 లక్షల బ్రాయిలర్ కోళ్ల ఉత్పత్తి అవుతుండగా 20 లక్షల కోళ్లు మన జిల్లాలోనే వాడుతున్నారు. 50 లక్షల కోళ్లను కడప, నెల్లూరు, బెంగళూరు, చెన్నై ప్రాంతాలకు పంపిస్తున్నారు. జిల్లాలో రోజుకు సుమారు 1.3లక్షల కిలోల చికెన్ వాడుతున్నారు. చికెన్ ధర కిలో రూ.210 నుంచి రూ.160 వరకు పడిపోగా లైవ్ కోడి విషయానికొస్తే.. రూ.105 నుంచి రూ.75 వరకు పడిపోయింది.ఈ లెక్కన జిల్లాలో పౌల్ట్రీ వ్యాపారులకు రోజుకు రూ.1.50 కోట్ల నష్టం వాటిల్లుతోంది.గుడ్ల విషయానికొస్తే.. రోజుకు 60 లక్షల కోడి గుడ్లు వస్తుండగా జిల్లావాసులు రోజుకు 15 నుంచి 20 లక్షల గుడ్లను తింటున్నారు. మిగిలినవి చెన్నై సహా పరిసర ప్రాంతాలు, కడప, అనంతపురం జిల్లాలకు ఎగుమతి అవుతున్నాయి. గుడ్డు ధర రూ.5.10 - రూ.5.20 నుంచి రూ.4.00- రూ.4.10 వరకు పడిపోయింది. అంటే సుమారు ఒక్క రూపాయి తగ్గింది. ఈ లెక్కన లేయర్ పరిశ్రమ యజమానులకు రోజుకు రూ.60 లక్షల నష్టం వాటిల్లుతోంది.



బాగా ఉడికించి తినండి



కోడి మాంసం, గుడ్లను బాగా ఉడికించి తింటే అనారోగ్య సమస్యలు రావు.బర్డ్ ఫ్లూ వ్యాధి గురించి అపోహలు, ఆందోళనలు తొలగించడానికి పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. అలాగే ముందస్తు వ్యాధి నిరోధక చర్యల్లో భాగంగా కోళ్ల రైతులకు సూచనలిస్తున్నాం.

– ప్రభాకర్, పశుసంవర్ధక శాఖ జేడీ

కోడి నుంచి బర్డ్ ఫ్లూ రాదు



ప్రపంచంలో ఎక్కడా కోడి లేదా గుడ్డు నుంచి మనుషులకు ఫ్లూ సోకిన దాఖలా లేదు.పాశ్చాత్య దేశాల తరహాలో మనం ఫ్రీజర్‌లో పెట్టం. 180 నుంచి 185 డిగ్రీల్లో ఉడకబెట్టి తింటాం. వంద డిగ్రీలకే వైరస్ చనిపోతుంది. పౌష్టికాహారాన్ని అందిస్తున్న పౌల్ట్రీ పరిశ్రమ మీద అనవసర వదంతులు సృష్టిస్తే రైతులు వేరే మార్గాలు చూసుకుంటారు. పౌష్టికాహార కొరత ఏర్పడుతుంది.

– వి.రమేష్ బాబు, నెక్ కేంద్ర కమిటీ సభ్యుడు, చిత్తూరు

రోగ నిరోధక శక్తి పెంచుకోవాలి

ఇతర జిల్లాల నుంచి మన జిల్లాకు కోళ్లు, గుడ్లు రావు. మనమే ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నాం కాబట్టి భయపడాల్సిన అవసరం లేదు. సక్రమంగా వ్యాక్సిన్ వేయడం, బయో సెక్యూరిటీ పద్ధతులు పాటిస్తూ ఉంటే రోగ నిరోధక శక్తి పెరిగి కోళ్లు ఎలాంటి వైరస్ బారిన పడవు.మా కంపెనీ ద్వారా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.



– వీటీ విజయ్‌బాబు, సీనియర్ మేనేజర్, వెంకటేశ్వర హేచరీస్

ఉత్తరాంధ్ర ప్రభావం వుంది

ఉత్తరాంధ్రలో బర్డ్ ఫ్లూ ప్రభావం మన జిల్లాపై భారీగా పడింది.కోళ్ల ఫీడ్ ధరలు భారీగా పెరగడం...కోడి గుడ్ల రేట్లు పడిపోవడంతో టెన్షన్ పడుతున్నాం.ఇదే పరిస్థితి నెల రోజులుంటే రూ.20 నుంచి రూ.30 లక్షలకు పైగా నష్టం రావడం ఖాయమనిపిస్తోంది.



– నాగభూషణం నాయుడు, ఉయ్యాలమిట్ట , గంగవరం మండలం

10వేల మంది కన్పించడం లేదు!

సభ్యత్వం ఉన్నా ఆచూకీ లేని 'విండో' సభ్యులు

ఆన్‌లైన్ ప్రక్రియ కారణంగా వెలుగులోకి

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):సింగిల్ విండోల్లో కొంత మంది సభ్యుల ఆచూకీ తెలియడం లేదు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో ఫైళ్ళ కంప్యూటరీకరణ రెండేళ్ళుగా సాగుతోంది. ఈ ప్రక్రియ తుదిదశకు చేరుకున్నా, ఈకేవైసీ చేద్దామంటే జిల్లాలో 10,790 మందికి పైగా సభ్యులు పత్తాలేకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సహకార సంఘాల ఆర్థిక లావాదేవీల ఆన్‌లైన్ ప్రక్రియ 2024 అక్టోబరు 2వ తేదీలోగా పూర్తిచేయాలని అప్పట్లో ప్రభుత్వం ఆదేశించింది కానీ లక్ష్యం మాత్రం నెరవేరలేదు. రైతుల ఈకేవైసీ ప్రక్రియను గ్రామ సచివాలయాలకు అప్పగించారు. గత వైసీపీ పాలనలో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయి. అప్పటి జిల్లా 'పెద్దాయన' మౌఖిక ఆదేశాలతో... సహకారశాఖ అధికారుల మౌనంతో...వైసీపీ మద్దతుదారులను, సానుభూతిపరులను పెద్దఎత్తున సభ్యులుగా చేర్పించారు. ఓటు హక్కు కోసం అర్హత లేనివారికి సభ్యత్వం కల్పించారు. వీరికి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ద్వారా నిబంధనలకు విరుద్ధంగా రుణాలను సైతం మంజూరు చేయించుకున్నారన్న ఆరోపణలున్నాయి.రైతుల ధ్రువీకరణ ప్రక్రియ పూర్తిచేసేందుకు సచివాలయ ఉద్యోగులు రైతు ముఖం, ఐరీష్, వేలిముద్రల ద్వారా అనుసంధానం చేయాలనుకున్నా చాలామంది స్థానికంగా అందుబాటులో ఉండడంలేదు. ఉపాధి, ఉద్యోగం, వ్యాపారం, పిల్లల చదువులకోసం నగరప్రాంతాలకు చాలామంది వెళ్ళారు.జాబితాలో నమోదు చేసిన సెల్‌ఫోన్ నెంబర్ల ఆధారంగా సంప్రదించాలని ప్రయత్నించినా పలకడం లేదు.ఓటీపీ చెప్పాలని అడిగితే గ్రామాల్లో రైతులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి సమస్యలతో ఈకేవైసీ నమోదులో జాప్యం జరుగుతోంది. భూములు కొనుగోలు చేసినవారు మ్యుటేషన్‌లో పేరు మార్చకపోగా భూములున్న ఉద్యోగులు భయాలతో ముందుకు రావడంలేదని సమాచారం.

ఇతరప్రాంతాలకు వెళ్ళడంతో...

కొంతమంది రైతులు తమ భూములను అమ్ముకున్నారు. మరి కొంతమంది వృద్ధాప్యం, ఇతర కారణాలతో మృతిచెందారు. మరికొందరు భూములను తమ పిల్లల పేర్లపై మార్చారు.అయినప్పటికీ వీరంతా ఇప్పటికీ సభ్యులుగా కొనసాగుతున్నారు. అంతేకాకుండా మండల సరిహద్దు గ్రామాల్లోని కొంత మంది రైతులకు 2-3 రెవిన్యూ గ్రామాల పరిధిలో భూములున్నాయి. వీరు ఆయా కేంద్రాల్లో రుణాలు తీసుకోవడంతో పాటు సింగిల్ విండోల్లో సభ్యత్వం కలిగివున్నారు. ఒకే వ్యక్తి 2-3 సంఘాల్లో ఓటు హక్కు వినియోగించుకోవడంతో పాటు రుణాలు కూడా పొందారు. గతంలో నమోదైన సభ్యులు ఉపాధి, ఉద్యోగ, వ్యాపారం కోసం ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వెళ్ళిపోవడంతో ఈకేవైసీ జరగడంలో ఆలస్యం అనివార్యమవుతోంది.

జిల్లాలో ఇదీ పరిస్థితి

జిల్లాలోని 31 మండలాల పరిధిలో 37 సింగిల్ విండోలున్నాయి. 90,789 మంది రైతులుండగా, వీరందరి ఈకేవైసీ సచివాలయాల సిబ్బంది చేస్తున్నారు. తాజాగా 79,999 మంది రైతుల ఈకేవైసీ పూర్తిచేసి 88.12శాతం లక్ష్యం సాధించారు. అత్యధికంగా కుప్పం రూరల్‌లో 4314 మంది రైతులుండగా, 3300 మంది ఈకేవైసీ పూర్తయింది.మిగిలిన 1014 మంది వివరాలు అందడం లేదు. నగరి రూరల్‌లో 2546 మందికి గాను 1880 మంది ఈకేవైసీ చేసుకోగా, మరో 666 మంది అడ్రసులు గల్లంతయ్యాయి. చిత్తూరు అర్బన్‌లో 615 మంది, వెదురుకుప్పంలో 643 మంది, శాంతిపురంలో 136 మంది వివరాలు తెలియరావడం లేదు. కాగా 10,790 మందికి సభ్యత్వం ఉన్నా, వారి ఆచూకీ లభించడం లేదు. ఆన్‌లైన్ ప్రక్రియతో ఇది వెలుగులోకి వచ్చింది. 2024 అక్టోబరు 2 లోగా పూర్తిచేయాల్సివున్న ఈకేవైసీ ప్రక్రియను విడతలవారీగా ప్రభుత్వం గడువు పెంచుతూ 2025 జనవరి 10వ తేదీని చివరిరోజుగా ప్రకటించింది. అయినా అధికారులు ఇంకా ఈకేవైసీ ప్రక్రియను కొనసాగిస్తున్నారు.



కదిరి మోహన ప్రభాకర్‌కు రాష్ట్రపతి ప్రతిభా సేవా పతకం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరానికి చెందిన బీఎస్ఎఫ్ మాజీ అసిస్టెంట్ కమాండెంట్ అధికారి కదిరి మోహనప్రభాకర్ రాష్ట్రపతి ప్రతిభా సేవా పతకాన్ని అందుకున్నారు.న్యూఢిల్లీలోని బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్) ప్రధాన కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో కదిరి మోహన ప్రభాకర్‌కు 2023కు గానూ బీఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ దల్జీత్‌సింగ్ రాష్ట్రపతి ప్రతిభా సేవా పతకాన్ని(ప్రెసిడెంట్ మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్) అందజేశారు. బీఎస్ఎఫ్‌లో 40ఏళ్ల పాటు నిర్విరామ సేవలందించినందుకు 2023వ సంవత్సరంలో గణతంత్ర దినోత్సవ సందర్భంగా కేంద్రప్రభుత్వం మోహన ప్రభాకర్‌కు ప్రతిభా సేవా పతకాన్ని ప్రకటించింది. మోహన ప్రభాకర్ బీఎస్ఎఫ్ విధి నిర్వహణలో భాగంగా జమ్మూలో పని చేశారు. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో ఇంటెలిజెన్స్ ఆఫీసర్‌గా చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, న్యూఢిల్లీల్లో సేవలందించారు. ప్రాథమిక పాఠశాల విద్యను కార్వేటినగరం ప్రభుత్వ పాఠశాలలో, ఉన్నత విద్యను తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర విశ్వ విద్యాలయంలో పూర్తి చేశాక మోహనప్రభాకర్ 1984మార్చి 19న బీఎస్ఎఫ్‌లో కానిస్టేబుల్‌గా చేరి అంచెలంచెలుగా ఎదిగారు. 2024లో అసిస్టెంట్ కమాండెంట్(మినిస్టీరియల్) హోదాలో రిటైరయ్యాక ఏపీ భవన్‌లో లైజన్ అండ్ ప్రోటోకాల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.



అలిపిరి మెట్లోత్సవం



అలిపిరి పాదాల మండపం వద్ద బుధవారం తెల్లవారుజామున మెట్లోత్సవం వైభవంగా జరిగింది. ఆంధ్రా, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడుకు చెందిన 3,500 మంది భజన మండళ్ల సభ్యులు పాల్గొన్నారు. టీటీడీ దాససాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి పి.ఆర్.ఆనందతీర్థాచార్య మెట్లపూజ నిర్వహించి ఉత్సవం ప్రారంభించారు. టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి మెట్లోత్సవం విశేషాన్ని సభ్యులకు వివరించారు. అనంతరం స్వామి సంకీర్తనలు ఆలపిస్తూ వీరంతా తిరుమల కొండకు నడచి చేరుకున్నారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

కన్నుల పండువగా

మాఘ పౌర్ణమి గరుడసేవ

తిరుమలలో బుధవారం మాఘమాస పౌర్ణమి గరుడసేవ వైభవంగా జరిగింది. విశేష అలంకరణలో మలయప్పస్వామి తన ఇష్టవాహనమైన గరుత్మంతుడిపై కొలువుదీరి నాలుగు మాడవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. మాఘ పౌర్ణమి కావడంతో భక్తులు అధిక సంఖ్యలో మాడవీధుల్లోని గ్యాలరీల్లోకి చేరుకుని శ్రీవారి ఉత్సవమూర్తిని దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



తిరుమల కొండల్లో..

వేడుకగా రామకృష్ణతీర్థ ముక్కోటి







తిరుమల శేషాచల అడవుల్లోని పుణ్యతీర్థాల్లో ఒకటైన శ్రీరామకృష్ణతీర్థ ముక్కోటి బుధవారం వేడుకగా జరిగింది. ప్రతిఏడాది మాఘ మాసంలో పౌర్ణమినాడు శ్రీరామకృష్ణతీర్థ ముక్కోటి నిర్వహించడం ఆనవాయితీ. శ్రీవారి ఆలయం నుంచి అర్చక సిబ్బంది మంత్రోచ్చారణ చేసుకుంటూ ఊరేగింపుగా బయలుదేరి ఉదయం 11 గంటలకు తీర్థానికి చేరుకున్నారు. అక్కడ కొలువై ఉన్న శ్రీరామచంద్రమూర్తి, శ్రీకృష్ణ భగవానుల విగ్రహాలకు పాలు, పెరుగు, చందనం, తదితర సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు.ఇక తీర్థానికి వెళ్లే భక్తులకు పాపవినాశనం డ్యాం వద్ద పొంగలి, ఉప్మా, సాంబారన్నం, పెరుగన్నం, పులిహోర పొట్లాలు, తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లను శ్రీవారిసేవకులు అందజేశారు. అలాగే టీటీడీ వైద్య విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మార్గ మధ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా టీటీడీ ఇంజినీరింగ్, ఫారెస్ట్ విభాగాలు సౌకర్యాలను కల్పించారు.



- తిరుమల, ఆంధ్రజ్యోతి



స్వామి అమ్మవార్లకు, త్రిశూలానికి పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి క్షేత్రంలో..

ఆగమోక్తంగా త్రిశూల స్నానం





త్రిశూలంతో వేదపండితులు

శ్రీకాళహస్తీశ్వరాలయం వద్ద స్వర్ణముఖి నదిలో బుధవారం ఆగమోక్తంగా త్రిశూలస్నానం నిర్వహించారు. మహాశివరాత్రికి 15 రోజుల ముందు మాఘపౌర్ణమి వస్తుంది. ఆ రోజున త్రిశూలస్నానం నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా రెండు రోజుల ముందు నుంచే స్వర్ణముఖి నదిలో పవిత్రజలాలను ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం స్వామి, అమ్మవార్లు, వినాయక స్వామి, వళ్లీ, దేవసేన సమేత కుమారస్వామి, చండికేశ్వరస్వామికి ఆలయ అలంకార మండపంలో పూజలు నిర్వహించి ధూపదీప నైవేద్యాలు నిర్వహించారు. అనంతరం చప్పరాలపై అధిష్ఠింపజేసి స్వర్ణముఖి నది వద్దకు తీసుకొచ్చారు. నది వద్ద స్వామి అమ్మవార్లను ఉంచి సద్యోముక్తి పురాణ ప్రవచనం అనంతరం త్రిశూల స్నానం నిర్వహించారు. అదే సమయంలో భక్తులు కూడా నదిలో మునిగారు. అనంతరం స్వామి అమ్మవార్లు పురవీధుల్లో ఊరేగారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ ఈవో బాపిరెడ్డి, డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డి, వేదపండితులు, బొజ్జల రిషితారెడ్డి, టీడీపీ నాయకులు విజయకుమార్, చెంచయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

■ నేడు వరల్డ్ రేడియో డే

బుల్లిపెట్టె నేస్తం



● కాలానుగుణ మార్పులను తట్టుకుని.. ఉనికి పదిలపర్చుకుంటున్న రేడియో

రేడియో..ఒకప్పుడు ఇంటిల్లపాదికీ ఆత్మీయనేస్తం.. ప్రభుత్వానికీ ప్రజల మధ్య సమాచార వారధి.. జాతీయ సమైక్యతకు సారథి..కళాకారులకు పెన్నిధి..ఆబాల గోపాలానికి ఆనందాల విందును పంచిన ఈ మాధ్యమం ఇప్పుడు ఉనికి నిలబెట్టుకునేందుకు సర్వశక్తులూ ఒడ్డుతోంది. మారుతున్న కాలమాన పరిస్థితులకు అనుగుణంగా బాణీ మార్చుకుంటోంది. తన ప్రియ శ్రోతలను అలరించేందుకు ఆధునికతను అందిపుచ్చుకుంటోంది. వినండి..వినండి.. వింటూనే ఉండండంటూ ఆహ్వానం పలుకుతోంది.

-తిరుపతి, ఆంధ్రజ్యోతి

సుమారు వందేళ్ల చరిత్ర ఉన్న రేడియో 1980 దశకం తర్వాత టీవీల రంగప్రవేశంతో నెమ్మదిగా ప్రజాదరణకు దూరమైంది. అందరికీ బంధువుగా నిలిచిన మాధ్యమం ఉనికి కోల్పోయే పరిస్థితి ఎదురైంది. అయితే కొన్నేళ్లుగా ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని ఉనికి పదిలపర్చుకోడానికి కృషి చేస్తోంది. రేడియో డిజిటల్ విప్లవంగా పరిణామం చెందుతోంది. ఆన్‌లైన్ స్ట్రీమింగ్, పాడ్‌కాస్టులు, ఉపగ్రహ రేడియోల పెరుగుదల రేడియో కంటెంట్‌ను ప్రపంచానికి పరిచయం చేస్తోంది. డిజిటల్ మీడియా పెరుగుతున్నా ఈ బుల్లి మాధ్యమం శక్తివంతమైన కమ్యునికేషన్ సాధనంగా నిలుస్తోంది. ప్రకృతి వైపరీత్యాల సమయంలో, మొబైల్ నెట్‌వర్క్ పనిచేయనప్పుడు రేడియో కీలకమైన సమాచార సాధనంగా ఉపకరిస్తోంది. అత్యవసర సమయాల్లో ప్రభావిత వర్గాలను చేరుకోవడానికి ప్రభుత్వాలు, ఎన్జీవోలు రేడియోపై అధారపడుతున్నాయి. కమ్యునిటీ రేడియో స్టేషన్లు స్థానిక వార్తలను ప్రసారం చేయడం, సామాజిక సమస్యలను చర్చించడం, స్థానిక సంస్కృతి, సంగీతాన్ని ప్లే చేయడంద్వారా లక్షలాది మందికి రేడియో చేరుకుంటోంది. పాడ్‌కాస్టులు, ఆడియోబుక్‌లు, ఆన్‌లైన్ టాక్ షోలు యువతరాల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఇప్పటికీ ప్రధాని మోదీ మన్‌కీబాత్ పేరిట దేశ ప్రజలతో అభిప్రాయాలను పంచుకుంటున్నారు. కమ్యునిటీ రేడియో వ్యవస్థ కూడా ఆదరణ పొందగలుగుతోంది.

తిరుపతిలోని ఆకాశవాణి కేంద్రం



● చిన్నప్పటి నుంచి రేడియో ప్రభావం

ఆరోతరగతి నుంచీ రేడియోకు అలవాటు పడ్డాం. పాటలు వింటూ స్కూల్‌కు రెడీ అయ్యేవాళ్లం. రాత్రి పాటలు వింటూ పడుకునేవాళ్ళం. ఆదివారమైతే రేడియోలో నాటకాలు వచ్చేవి. ఆసక్తిగా వినేవాళ్ళం. ఇప్పుడు కూడా ఉదయం నిద్రలేచింది మొదలు డ్యూటీకి రెడీ అయ్యేవరకు రేడియో ఆన్‌లోనే ఉంటుంది. సాయంత్రం ఇంటికి వచ్చాక మళ్లీ రేడియో ఆన్ చేసి ఆకాశవాణి వార్తలు వినడం అలవాటు.

- డాక్టర్ ఏవై లక్ష్మి ప్రొఫెసర్, స్విమ్స్ రేడియాలజి విభాగం



● అభిరుచికి అనుగుణంగా మార్పులు



కాలానుగుణంగా అభిరుచి మేరకు కార్యక్రమాలను అందిస్తున్నాం. తిరుపతి ఆకాశవాణి పరిధిలో మంచి శ్రోతలు ఉన్నారు. బయటపడరు. ఉదయం 5.53 గంటలకు సిగ్నేచర్ ట్యూన్‌తో మొదలై 6 గంటలనుంచి ప్రబోధగీతం, వార్తలు, సూక్తిముక్తావళి, పొలం కబుర్లు, ప్రాంతీయ వార్తలు, ఉదయరాగం (సినిమా పాటలు) ఉంటాయి. 7.15 గంటలకు ప్రభాతరేఖల్లో హెల్త్, పొయిట్రీ, షార్ట్ స్టోరీస్, ప్రభుత్వ స్కీమ్స్ ఇంటర్వ్యూ ప్రసారాలు ఉంటాయి. హలో ఆకాశవాణి వాట్సప్ చిత్రం, లిజనర్స్ పాటలు, వనితా లోకం, యువవాణి, బాలానందం,కిసాన్ వాణి వంటి కార్యక్రమాలకు ఆదరణ ఉంది.

- మోహన్ సుధాకర్, ఏడీ, ఆకాశవాణి తిరుపతి

● రేడియో నా నేస్తం

1964నుంచి రేడియో ప్రసారాలు వింటున్నాను. అప్పుడు నా వయస్సు 30 ఏళ్లు. ఇప్పుడు 92 ఏళ్లు వచ్చినా రేడియోను వదలిపెట్టలేదు. అదేనా ఫ్రెండ్. ఉదయం సుప్రభాతంతో మొదలై వార్తలు, నిపుణుల సలహాలు, రాత్రి పడుకునే ముందు లలిత సంగీతం వింటూ పడుకుంటాను. రాష్ట్ర విభజనానంతరం కూడా తిరుపతి రిలే స్టేషన్‌గానే ఉంది. ఇప్పటికైనా మెయిన్ స్టేషన్‌గా మార్చాలి.



- టి.సుబ్బన్న, రైల్వే విశ్రాంత ఉద్యోగి, తిరుపతి

ముగ్గురు అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

● రూ.25 లక్షల బంగారు ఆభరణాలు, కారు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బంగారు నగలను చూపుతున్న ఎస్పీ హర్షవర్ధన రాజు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు, ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో ఇంటి దొంగతనాలు, తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడే ముగ్గురు దొంగలను తిరుపతి, తిరుచానూరు పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వారి నుంచి రూ.25 లక్షల విలువ చేసే 277 గ్రాముల బంగారు నగలు, ఒక కారు స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను బుధవారం ఎస్పీ హర్షవర్ధన్‌రాజు మీడియాకు వివరించారు. ఆయన తెలిపిన ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం మెహిదీపట్నంకు చెందిన సుధాకర్ అలియాస్ ఆంథోని, రంగారెడ్డి జిల్లాకు చెందిన పిల్లిశేఖర్, ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన గాజులపల్లి శ్రీనివాసులురెడ్డి మంచి స్నేహితులు. వీరిలో సుధాకర్‌పై 100కుపైగా, పిల్లి శేఖర్ పైన 160కిపైగా దొంగతనం కేసులున్నాయి. ఈ ముగ్గురు కలిసి ఇటీవల తిరుపతి రూరల్ మండలం శెట్టిపల్లె పంచాయతీ తిరుమల నగర్‌లోని రవి ఇంటి తాళాలు పగలగొట్టి బంగారు, నగదు అపహరించుకొని వెళ్లారు. బాధితుల ఫిర్యాదుతో తిరుచానూరు పోలీసులు కేసు నమోదు చేశారు. దొంగలను పట్టుకునేందుకు తిరుపతి క్రైం అదనపు ఎస్పీ నాగభూషణరావు పర్యవేక్షణలో చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్, తిరుచానూరు సీఐ సునీల్ కుమార్, ఎస్ఐలు అరుణ, జగన్నాథరెడ్డి, సాయినాథ్ చౌదరి ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం పలు ప్రాంతాల్లో గాలించారు. ఈ క్రమంలో తమకు అందిన సమాచారం మేరకు బుధవారం తిరుపతి ఆర్టీవో కార్యాలయం వద్ద తిరుగుతున్న సుధాకర్, పిల్లి శేఖర్,గాజులపల్లి శ్రీనివాసులురెడ్డిని అదుపులోకి తీసుకుని విచారించారు. వీరి నుంచి రూ.25 లక్షల విలువ చేసే 277 గ్రాముల బంగారు ఆభరణాలు, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన తిరుచానూరు సీఐ, ఎస్ఐలు, సిబ్బందిని అభినందించారు.

టీటీడీ ఏడీ భవనం ఎదుట సాధువుల నిరశన దీక్ష



తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): తిరుపతి జూపార్కు రోడ్డులో నిర్మాణం చేపడుతున్న ఒబెరాయ్ హోటల్ అనుమతులు తక్షణమే రద్దు చేయాలని బుధవారం కొందరు సాధువులు టీటీడీ పరిపాలన భవనం ఎదుట నిరశన దీక్షకు దిగారు. టీటీడీ పాలకమండలిలో ఒబెరాయ్ హోటల్ రద్దు చేస్తున్నట్లు తీర్మానించారని, అయినా అక్కడ పనులు చురుగ్గా జరుగుతున్నాయని శ్రీనివాసానందసరస్వతి తెలిపారు. ఈ విషయంలో కూటమి ప్రభుత్వం తిరుమల ప్రవిత్రతను నాశనం చేసే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. వారాహి డిక్లరేషన్, సనాతన ధర్మరక్షణ బోర్డును తీసుకొస్తామని తిరుమల క్షేత్రంలో చెప్పిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్.. ఈ విషయంలో ఎందుకు వెనకడుగు వేస్తున్నారని ప్రశ్నించారు. జనసేన హస్తం ఉందికాబట్టే హోటల్ నిర్మాణం యథేచ్ఛగా సాగుతోందన్నారు. దీనిని రద్దు చేసేంతవరకు అమరణ నిరాహార దీక్ష కొనసాగుతుందన్నారు.

ముగ్గులేసిన మహిళలకు రూ.5.56 లక్షల పంపిణీ

చంద్రగిరి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం నారావారిపల్లెలో భోగి పండుగ రోజున సీఎం చంద్రబాబు సతీమణి భువనేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలకు రూ.10,116 చొప్పున రూ.5,56,380 బుధవారం పంపిణీ చేశారు. ఏటా నారావారిపల్లెలో ఎ.రంగంపేట నుంచి భీమవరం వరకు గ్రామాల మహిళలకు ముగ్గులు, పిల్లలకు ఆటల పోటీలను భువనేశ్వరి నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న వారికి బహుమతులు ప్రదానం చేస్తారు. గతనెలలో ముగ్గుల పోటీల్లో 55మంది ముగ్గులు వేశారు. ఆమె ఆదేశాల మేరకు బుధవారం టీటీడీ కళ్యాణ మండపంలో ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా రూ.10,116 వంతున వారందరికీ అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోదండరామానాయుడు, వైకుంఠం శ్రీధర్‌నాయుడు, సర్పంచ్ భర్త గిరినాయుడు, నిరంజన్‌నాయుడు, శేఖర్‌నాయుడు, కుమార్, వల్లూరి శ్రీకాంత్‌చౌదరి, చైతన్య తదితరులు పాల్గొన్నారు.



ముగ్గుల పోటీల్లో పాల్గొని.. నగదు బహుమతి అందుకున్న మహిళలు






బిర్జీస్‌ఫాతిమా పెన్సిల్‌తో గీసిన చిత్రాలు


ఫాతిమా పెయింటింగ్స్

చిత్రలేఖనంలో బైరెడ్డిపల్లె విద్యార్థిని ప్రతిభ

కృషి, పట్టుదల వుంటే ఆసక్తివున్న రంగాల్లో రాణించవచ్చుని బైరెడ్డిపల్లెకు చెందిన విద్యార్థిని బిర్జీస్‌ఫాతిమా నిరూపిస్తోంది.నెహ్రూనగర్‌లో నివాసముంటున్న మస్తాన్‌వలి, తహసీన్‌ఫాతిమా దంపతుల కుమార్తె అయిన బిర్జీస్‌ఫాతీమా ప్రస్తుతం బెంగళూరులో బీఫార్మసీ చదువుతోంది. చిన్నప్పటి నుంచి బిర్జీస్‌ఫాతిమాకు చిత్రలేఖనం, పెయింటింగ్ ఆర్ట్స్ అంటే చాలా ఆసక్తి కనబరుస్తుండడంతో తల్లిదండ్రులు ప్రోత్సాహం అందించారు.మస్తాన్‌వలి కూడా డ్రాయింగ్‌లో డిప్లొమా చేశారు. అలాగే తల్లి తహసీన్‌ఫాతిమాకు కూడా చిత్రలేఖనంలో ప్రావీణ్యం ఉంది. తల్లిదండ్రులను స్ఫూర్తిగా తీసుకున్న బిర్జీస్‌ఫాతీమా చిత్రలేఖనంలో మెలకువలు నేర్చుకుని పెన్సిల్‌తో రకరకాల ఆకర్షణీయమైన చిత్రాలను వేస్తోంది. అలాగే మనుషుల ముఖాలపై రంగురంగుల పెయింటింగ్స్ వేయడంలో కూడా ప్రతిభ చాటుతోంది. చదువుతో పాటు చిత్రలేఖనంలో కూడా రాణించాలనే చిత్రాలు గీస్తున్నానని, భవిష్యత్తులో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలన్నదే తన లక్ష్యమని బిర్జీస్ ఫాతిమా చెబుతోంది.

\- బైరెడ్డిపల్లె, ఆంధ్రజ్యోతి


బిర్జీస్‌ఫాతిమా



చిన్నారుల ముఖాలపై బిర్జీస్‌ఫాతిమా వేసిన పెయింటింగ్స్

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కుప్పం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో గురువారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే ఈ వేదికలో ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించి పరిష్కారాలు చూపుతామన్నారు.నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు హాజరై అప్పటికప్పుడు పలు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.

ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు ప్రక్రియను వేగవంతం చేయండి : కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత, సంక్షేమ పథకాల వర్తింపునకు ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో ఈ అంశంపై సంబంధిత శాఖల జిల్లాస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. 16-59 ఏళ్లలోపున్న వారిలో.. ఆదాయ పన్ను చెల్లించని, ఈపీఎఫ్, ఈఎస్‌ఐ సదుపాయం లేని కార్మికులు ఈ-శ్రమ్‌లో నమోదు చేసుకోవచ్చన్నారు. జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ ఓంకార్, డ్వామా పీడీ రవికుమార్, బీసీ కార్పొరేషన్ ఏడీ శ్రీదేవి, ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రవాణా ఆపాలంటూ మహిళల ధర్నా


ధర్నా చేస్తున్న మహిళలు

నగరి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఇసుక రవాణా ఆపాలంటూ బుధవారం ఉదయం ఎనిమిది గంటలకు నగరి మున్సిపాలిటీ పరిధిలోని సత్రవాడ మహిళలు ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. రాత్రీపగలు తేడా లేకుండా ఇష్టానుసారంగా ఇసుకను దోచుకుంటున్నారని, కొందరైతే తమిళనాడుకు అక్రమంగా రవాణా చేస్తున్నారని విమర్శించారు. ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటేనే భయంగా ఉందని, రాత్రిపూట కూడా ట్రాక్టర్ల జోరు అధికంగా ఉండడంతో ఏ సమయంలో ఏమి జరుగుతుందో అర్థం కావడం లేదని వాపోయారు. దాదాపు రెండు గంటలపాటు ధర్నా నిర్వహించడంతో డీఎస్పీ అజీజ్, సీఐ మహేశ్వర్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రెవెన్యూ అధికారులను పిలిపించి ఇసుక రవాణాను క్రమ పద్ధతిలో జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో మహిళలు ధర్నా విరమించారు.

మీ పనితీరు మార్చుకోండి

● తహసీల్దార్లకు జేసీ మందలింపు

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): 'మీ పనితీరు సక్రమంగా లేదు. ఇకనైనా మార్చుకోండి.. లేకుంటే ఇబ్బంది పడతారు' అంటూ తహసీల్దార్లను జేసీ విద్యాధరి మందలించారు. రెవెన్యూ అంశాలపై బుధవారం ఆమె తహసీల్దార్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ సమస్యలకు పరిష్కారం కాకపోవడంతో అర్జీదారులు డివిజినల్, జిల్లాకేంద్రాలకు వస్తున్నారని మండిపడ్డారు. తహసీల్దార్లు క్షేత్రస్థాయికి వెళ్లకపోవడం వల్లే ఇలా జరుగుతోందని చెప్పారు. ప్రధానంగా రెవెన్యూ గ్రామసభల ద్వారా అందిన అర్జీలకు నోటీసులు జారీచేసి, ఎక్కడికక్కడ సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. జాయింట్ ఎల్పీఎం సమస్యలు రీసర్వే విభాగంలో అధికంగా ఉన్నాయని, వెంటనే పరిష్కరించాలన్నారు.

'ఎన్టీఆర్ వైద్యసేవ'కు డబ్బులు వసూలు చేస్తారా?

చర్యలు తప్పవని నెట్‌వర్క్ ఆస్పత్రుల నిర్వాహకులకు కలెక్టర్ హెచ్చరిక


నెట్‌వర్క్ ఆస్పత్రుల ప్రతినిధులతో సమావేశమైన కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): 'జిల్లాలోని నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో 'ఎన్టీఆర్ వైద్యసేవ' కోసం వచ్చే వారినుంచి నిబంధనలకు విరుద్ధంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయి. ఇలాగే కొనసాగితే చర్యలు తప్పవు' అని నిర్వాహకులను కలెక్టర్ సుమిత్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో నెట్‌వర్క్ ఆస్పత్రులపై జిల్లా క్రమశిక్షణ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఎన్టీఆర్ వైద్యసేవలకు వచ్చే రోగుల నుంచి నెట్‌వర్క్ ఆస్పత్రులపై 31 ఫిర్యాదులు అందాయని చెప్పారు. ఆయా ఫిర్యాదులపై సంబంధిత ఆస్పత్రులకు సంబంధించి బిల్లులను పరిశీలించారు. ఆరోగ్యమిత్రలు కూడా రోగులకు అవసరమైన సహకారం అందించేలా చూడాలని ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ సుదర్శన్‌ను కలెక్టర్ ఆదేశించారు.

ఎనిమిది హాస్టల్ భవనాలకు రూ.1.56కోట్లతో మరమ్మతులు

● ఏఎస్‌డబ్ల్యూవో షకీల వెల్లడి



గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): నాలుగు మండలాల్లోని సాంఘిక సంక్షేమశాఖకు చెందిన ఎనిమిది హాస్టళ్లకు చెందిన పక్కా భవనాలను బాగుచేయడానికి రూ.1.56 కోట్లతో పనులు మంజూరైనట్లు ఏఎస్‌డబ్ల్యూవో వి.షకీల తెలిపారు. బుధవారం గంగాధరనెల్లూరులో ఆమె మీడియాతో మాట్లాడారు. హాస్టళ్ల భవనాలు మరమ్మతులకు గురైన విషయాన్ని కలెక్టర్ సుమిత్‌కుమార్, సాంఘిక సంక్షేమశాఖ డీడీ చెన్నయ్య గుర్తించారన్నారు. ఆ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడంతో నిధులు మంజూరయ్యాయని చెప్పారు. ఈ నిధులతో వైరింగ్, ప్లంబింగ్, మరుగుదొడ్లు, తలుపులు, కిటికీలను బాగుచేయడం, తదితర పనులు చేయనున్నట్లు తెలిపారు.

మంజూరైన నిధులిలా..

గంగాధరనెల్లూరులోని బాలికల హాస్టల్‌కు రూ.21లక్షలు, బాలుర హాస్టల్‌కు రూ.22లక్షలు, తూగుండ్రంలోని బాలుర హాస్టల్‌కు రూ.20.50లక్షలు, పూతలపట్టులోని బాలుర హాస్టల్‌కు రూ.16లక్షలు, పి.కొత్తకోటలోని బాలుర హాస్టల్‌కు రూ.16లక్షలు, శ్రీరంగరాజపురం మండలం కొత్తపల్లెమిట్టలోని బాలుర హాస్టల్‌కు రూ.33లక్షలు, పెనుమూరులోని బాలుర హాస్టల్‌కు రూ.10లక్షలు, ఉగ్రాణంపల్లెలోని బాలుర హాస్టల్‌కు రూ17.50లక్షలు మంజూరైనట్లు ఏఎస్‌డబ్ల్యూవో తెలిపారు.

పసిబిడ్డ మృతి కేసులో ఆరుగురి అరెస్టు

చిత్తూరుఅర్బన్,ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): పసికందు మృతి చెందిన కేసులో ఆరుగురిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. వివరాలను చిత్తూరు రెండో పట్టణ సీఐ నెట్టికంఠయ్య మీడియాకు తెలిపారు. తమిళనాడు రాష్ట్రం కాట్పాడికి చెందిన గుణసుందరి, సుమతిలు అక్కాచెల్లెళ్లు. వీరిలో గుణసుందరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈమె భర్త రిటైర్డు ఆర్మీ ఉద్యోగి. ఇటీవల ఆయన మరణించారు. అప్పటికే గుణసుందరి నిండు గర్భిణిగా ఉన్నారు. పుట్టే బిడ్డను పోషించడం కష్టమని భావించింది. ఈ నేపథ్యంలో పుట్టే బిడ్డను ఎవరికైనా ఇచ్చేస్తానని తనకు పరిచయమున్న నళినికి చెప్పింది. ఆమె ఈ విషయాన్ని చిత్తూరు సంతపేటకు చెందిన అఖిలకు చేరవేసింది. ఈనెల 10వ తేదీన గుణసుందరి, సుమతిలు సంతపేటలోని నళిని ఇంటికి చేరుకున్నారు. గుణసుందరికి తన ఇంట్లోనే అఖిల డెలివరీ చేయించింది. మగబిడ్డ పుట్టాడు. తర్వాత అఖిల స్నేహితురాలైన చంద్రకళకు బిడ్డలు లేకపోవడంతో ఆమెకు విషయాన్ని చెప్పారు. అప్పటికే ఆమె చెన్నైలో ట్రీట్‌మెంట్ చేయించుకోవడంతో సంతానం కలిగినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో తనకు గతంలో బస్సులో పరిచయమైన బిడ్డలు లేని తిరుపతికి చెందిన సుజాతకు ఫోన్‌ద్వారా చంద్రకళ చెప్పింది. అదే రోజు రాత్రి సుజాత, చంద్రకళ వచ్చి బిడ్డను చూశారు. అయితే బిడ్డ నోట్లో నుంచి నురుగ వస్తుండటంతో చిత్తూరులోని రెండు ప్రైవేటు ఆస్పత్రుల్లో చూపించారు. అక్కడి డాక్టర్లు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. చంద్రకళ, సుజాతలు పసిబిడ్డను తీసుకుని ఆటోలో ప్రభుత్వాస్పత్రికి చేరుకున్నారు. బిడ్డ తల్లి ఎక్కడని వైద్యులు అడగ్గా.. ఇంట్లో ప్రసవం జరగడంతో రక్తస్రావం ఎక్కువైందని, అందువల్ల తీసుకురాలేదని చెప్పారు. 11వ తేదీన ఐసీయూలో చికిత్స చేస్తుండగా సాయంత్రం బిడ్డ మరణించాడు. ఇది తెలిసి చంద్రకళ అక్కడినుంచి జారుకునే ప్రయత్నం చేసింది. డాక్టర్లు అవుట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇవ్వగా.. ఆమెను రెండో పట్టణ పోలీసులు విచారించడంతో అసలు విషయం బయటపడింది. పసిబిడ్డ మృతికి కారణమైన గుణసుందరి, సుమతి, నళిని, చంద్రకళ, అఖిల, అఖిల బంధువు గోపీలపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

నాగలాపురంలో 'లక్కీ భాస్కర్'!

● బ్యాంకులో చేతివాటం
● రూ.రెండు కోట్లకుపైగా నగలు గోల్‌మాల్

సత్యవేడు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): నాగలాపురం లోని ఓ బ్యాంకులో కీలక విభాగంలో పని చేస్తున్న ఉద్యోగి లక్కీ భాస్కర్ సినిమా తరహాలో చేతివాటం చూపాడు. రూ.రెండు కోట్లకు పైగా నగలు గోల్‌మాల్ చేసినట్లు సమాచారం. సదరు బ్యాంకులో తాకట్టుకోసం పెట్టిన నగలను తన సొంతానికి వాడుకున్నట్లు తెలిసింది. ఇటీవల బ్యాంకులో సోషల్ ఆడిట్ జరగడంతో నగలకు సంబంధించిన లావాదేవీలలో తేడాలను గుర్తించారు. దీనిపై అధికారులు విచారణ జరపగా విషయం బయటపడినట్లు తెలిసింది. ఏకంగా రూ.రెండుకోట్లకు పైగా నగలకు సంబంధించిన లావాదేవీలలో అక్రమాలకు పాల్పడినట్లు నిర్ధారించి, అతడిని విధులనుంచి తొలగించినట్లు సమాచారం. ఈ విషయం బయటకు పొక్కనీయకుండా విచారణ సాగిస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై పోలీసులకూ ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

సాంకేతిక సమస్యలతో సబ్సిడీ రుణ లబ్ధిదారుల ఇక్కట్లు

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలకోసం దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులను సాంకేతిక(టెక్నికల్) సమస్యలు వెంటాడుతున్నాయి. బుధవారం నాటికి స్వయం ఉపాధి పథకం, స్పెషల్ స్కీమ్ కింద 2,936 యూనిట్లకుగాను 16,398 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఇందుకోసం ప్రభుత్వం జిల్లాకు రూ.32.70 కోట్ల సబ్సిడీ, రూ.3.70 కోట్ల బ్యాంకు రుణాన్ని మంజూరు చేసింది. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ సాంకేతికంగా తలెత్తిన సమస్యలతో లబ్ధిదారులంతా ఎంపీడీవో, జిల్లా బీసీ కార్పొరేషన్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

ఆధార్, రేషన్ కార్డులే ప్రామాణికంగా..

ఆధార్, రేషన్‌కార్డులనే ప్రభుత్వం ప్రామాణికంగా తీసుకుంది. ఆ మేరకు దరఖాస్తులో యూనిట్ పేరు, జిల్లా, మండలం పేర్లను లబ్ధిదారులు నమోదు చేయాలి. ఇక్కడే సమస్య తలెత్తింది. చాలామంది ఉమ్మడి చిత్తూరు జిల్లాగా ఉన్నప్పుడు ఆధార్ కార్డు తీసుకుని ఉన్నారు. ప్రస్తుతం గతంలో చిత్తూరు జిల్లాలో ఉండిన కొన్ని మండలాలు తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లోకి వెళ్లాయి. ఈ నేపథ్యంలో తమ ఆధార్ కార్డు ఆధారంగా దరఖాస్తు చేసేటప్పుడు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

సమస్య తలెత్తుతోందిలా..

ఉదాహరణకు.. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తికి చెందిన ఓ వ్యక్తి రుణం కోసం దరఖాస్తు చేసుకోవడానికి నెట్‌సెంటర్‌కు వెళ్లాడు. తన ఆధార్ కార్డు ఇవ్వగా అందులో చిత్తూరు జిల్లా అని ఉంది. ఆ ప్రకారమే నెట్ సెంటర్ నిర్వాహకుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసేసరికి శ్రీకాళహస్తి కనిపించడం లేదు. అయినా దరఖాస్తులను సమర్పించేస్తున్నారు. దీనివల్ల దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యే అవకాశం ఉంది. ఇలాంటి దరఖాస్తులు వందల సంఖ్యలో ఉన్నాయి. వీరంతా ఎంపీడీవో, మున్సిపల్, జిల్లా బీసీ కార్పొరేషన్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.



దరఖాస్తు రిజిస్ట్రేషన్ ఫారం

ఎడిట్ ఆప్షన్ పనిచేయడం లేదు

జిల్లా, మండల అధికారులకు ఎడిట్ ఆప్షన్ ఇచ్చినప్పటికీ అది పనిచేయడం లేదు. ఈ కారణంగా తమ దరఖాస్తులు ఎక్కడ తిరస్కరణకు గురవుతాయో అన్న ఆందోళనలో లబ్ధిదారులు ఉన్నారు. ఇకనైనా ఎడిట్ ఆప్షన్ పనిచేసేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ఇంటర్ ప్రశ్నపత్రాల భద్రతకు స్ట్రాంగ్ రూమ్ సిద్ధం


స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలిస్తున్న డీవీఈవో, డీఈసీఎంలు

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మార్చి ఒకటి నుంచి 17వ తేదీ వరకు జరగనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి ఒకటి, రెండో జుల్లో ప్రశ్నపత్రాలు జిల్లాకు రానున్నాయి. వీటిని భద్రపరిచేందుకు బుధవారం జిల్లా కేంద్రంలోని పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డీవీఈవో సయ్యద్ మౌలా, జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు (డీఈసీఎం) స్ట్రాంగ్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ప్రశ్నపత్రాలను ఇక్కడ భద్రపరిచి, ఆపై నిర్ణయించిన రూట్లలో పటిష్ట భద్రత మధ్య సెంటర్ల సమీపంలోని పోలీసు స్టేషన్లకు తరలిస్తారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 28 సెంటర్లలో జరుగుతున్న ఇంటర్మీడియట్ జనరల్ ప్రాక్టికల్స్ ఈనెల 20వ తేదీతో పూర్తవుతాయి.

వైభవంగా పున్నమి గరుడసేవ



ఐరాల (కాణిపాకం), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి అనుబంధ ఆలయమైన వరదరాజస్వామి ఆలయం లో బుధవారం రాత్రి పున్నమి గరుడ సేవను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో పెంచలకిషోర్, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు తదితరులు పాల్గొన్నారు.

15న 'ఆకాశవాణి' రైతు దినోత్సవం

పెనుమూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఆకాశవాణి కేంద్రం సౌజన్యంతో రైతు దినోత్సవాన్ని శనివారం ఉదయం తొమ్మిది గంటలకు వద్ద ఉన్న మ్యాంగో భవన్లో నిర్వహించనున్నారు. ఈ మేరకు తిరుపతి ఆకాశవాణి సంచాలకుడు ఎం.సుధాకర్‌మోహన్, ప్రకృతి వ్యవసాయ రైతు హర్షిష్టారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్, జేసీ, జిల్లా వ్యవసాయ అధికారి, ఉద్యానశాఖ అధికారి, ఏపీడీ, రాస్ శాస్త్రవేత్తలతోపాటు కెనరా, సప్తగిరి, ఎస్బీఐ, యూనియన్ బ్యాంకు మేనేజర్లు హాజరవుతారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 15 మంది అభ్యుదయ రైతులను సత్కరిస్తున్నామన్నారు. రైతులంతా హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పేలిన ఆర్టీసీ బస్సు టైరు

ప్రయాణికులు సురక్షితం



వెదురుకుప్పం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు బుధవారం సాయంత్రం తిరుపతి నుంచి పచ్చికాపల్లం మీదుగా తమిళనాడులోని పళ్లిపట్టుకు వెళ్తోంది. పచ్చికాపల్లం సమీపంలోని ముత్యాలమ్మ గుడి మలుపు వద్ద అదుపు తప్పింది. టైర్ పేలడం వల్లే ప్రమాదం జరిగిందని ప్రయాణికులు తెలిపారు. ఈ ప్రమాదంలో బస్సులోని వారెవరికీ గాయాలవలేదు. దీంతో అందరూ హమ్మయ్య అంటూ ఊపిరి పీల్చుకున్నారు.


బస్సు వద్ద ప్రయాణికులు

పలమనేరు
కుప్పం/పుంగనూరు

అందరి కృషితో కాలుష్య రహిత పట్టణం

● మున్సిపల్ కమిషనర్ ఎస్.వి.రమణారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ఎస్.వి.రమణారెడ్డి

పలమనేరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పలమనేరును కాలుష్య రహిత పట్టణంగా తయారు చేసేందుకు అందరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.వి. రమణారెడ్డి కోరారు. బుధవారం పలమనేరు పాతపేటలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల నుంచి తడిచెత్త, పొడి చెత్త వేర్వేరుగా అందించాలన్నారు. దీంతో వ్యర్థాలను సులభంగా రీసైకిల్ చేయడం, తడి వ్యర్థాలను కంపోస్టుగా ఉపయోగించడం సులభతరమవుతుందన్నారు. ఫలితంగా గాలి, నీటి కాలుష్యం తగ్గుతుందని తెలిపారు. అదనంగా మిగిలిన ఎరువుతో అదనపు ఆదాయాన్ని పెంచుకోవచ్చన్నారు. పట్టణ ప్రజలు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో పలమనేరు మున్సిపల్ మేనేజర్ ఖాదర్ మొహిద్దీన్, మెప్మా సీఎంఎం బాబా, మెప్మా సీవోలు, ఆర్‌పీవోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విశిష్ట గుర్తింపు కార్డుకు పేర్లు నమోదు చేసుకోండి


సమావేశంలో మాట్లాడుతున్న ఏవో ఫయాజ్ బాషా

కుప్పం రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రైతులు విశిష్ట గుర్తింపు కార్డుకోసం తమ పేర్లను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఫయాజ్ బాషా కోరారు. మండలంలోని చెక్కునత్తం పంచాయతలోని రైతు సేవా కేంద్రంలో బుధవారం ఆయన రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశిష్ట గుర్తింపు సంఖ్య ఉంటేనే ఒకపై ప్రభుత్వం అందించే ఏ పథకానికైనా అర్హులవుతారని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి చెక్కునత్తం మణి, మాజీ సర్పంచి దేవేంద్ర, టీడీపీ అధ్యక్షుడు మునిరత్నం, తిమ్మప్ప, బీరప్ప, వెంకటాచలం, బాలు, రామప్ప, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సోమల ప్రభుత్వాస్పత్రి తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి మల్లికార్జున

సోమల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాలతో మండల ప్రత్యేకాధికారి మల్లికార్జున బుధవారం సోమల మండలంలో పర్యటించి తనిఖీలు చేపట్టారు. సోమల ప్రభుత్వాస్పత్రిలో పలు రికార్డులు తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడి వైద్యసేవలపై ఆరా తీశారు. అనంతరం ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన్నాన పరిశీలించారు. సోమల-నంజంపేట మార్గంలోని మురుగునీటి కాలువల దుస్థితి పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ జయసింహ, సీహెచ్‌వో అమరనాథ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం..!

● పీలేరు సహాయ కార్మిక అధికారి ఆనందబాబు


కల్లూరులో బాలకార్మిక నిర్మూలనపై అవగాహన ర్యాలీ

కల్లూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): బాల కార్మిక వ్యవస్థ నుంచి పిల్లలను విముక్తులను చేద్దామని పీలేరు సహాయ కార్మిక అధికారి ఆనందబాబు తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు పట్టణంలో బుధవారం బాల కార్మిక నిర్మూలనపై హోటళ్లు, పలు దుకాణాలను తనిఖీ చేశారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పిల్లలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని.. అలాంటి వారిపై కేసులు పెడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటశిద్దులు, సీఆర్‌పీ అష్రఫ్ పాల్గొన్నారు.

15న బైరెడ్డిపల్లెలో వాలీబాల్ పోటీలు

బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో పూర్వవిద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 15న వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలకు ఫోన్‌నంబర్లు 9908585899, 9703226723, 9160988254లను సంప్రదించాలని కోరారు.

పలమనేరు పురపాలక సంఘు కార్యాలయము

ఆర్.ఓ.సి.నెం.03/2025/ఎ1 | **బహిరంగ వేలము ప్రకటన** | తేది:12.02.2025

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేనగా, చిత్తూరు జిల్లా గెజిట్ నెం.04/2025, తేది:01.02.2025 మేరకు పలమనేరు పురపాలక సంఘమునకు చెందిన లీజులు 2025-26 (01.04.2025 నుండి 31.03.2026 వరకు) మరియు ఈ క్రింది తెలిపిన షాపు రూములను నెలసరి అద్దెపై కేటాయించుటకు **తేది:27.02.2025న ఉదయం గం.11.00**లకు పలమనేరు పురపాలక కార్యాలయము నందు బహిరంగ వేలము జరుపబడునునని తెలియజేయడమైనది. ఆసక్తిగల పాటదారులు ఈ బహిరంగ వేలము నందు పాల్గొనువారు కార్యాలయములోని రెవెన్యూ విభాగము నందు ముందుగా ఈ దిగువ తెలిపిన విధముగా డిపాజిట్‌ను తప్పనిసరిగా డి.డి. రూపములో, ఆధారు గుర్తింపు కార్డు మరియు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో సమర్పించి తగు గుర్తింపు కార్డుతో బహిరంగ వేలములో పాల్గొనవలసినదిగా తెలియజేయడమైనది.

ఐటం	సర్కారు వారి రేటు రూ.	డిపాజిట్ (డిడి)	సాల్వేన్సీ ధ్రువపత్రము	సాల్వేన్సీ లేనివారు డిపాజిట్ (డి.డి)
వారపు సంత	11,38,000/-	3,00,000/-	10,00,000/-	5,00,000/-
దినసరి కూరగాయల మార్కెట్	18,18,000/-	5,00,000/-	15,00,000/-	7,50,000/-
చింతచెట్ల ఫల సహాయము	5,000/-	6,500/-	20,000/-	10,000/-
బొమ్మిదొడ్డిచెరువు	1,43,500/-	50,000/-	1,00,000/-	50,000/
నీళ్ళకుంట చెరువు	19,200/-	5,000/-	15,000/-	10,000/-
షాపు రూములు				
1. Dr.YSR మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్ - షాపు నెం.12 (General)	3,700/-	4,50,000/-	(Goodwill)	-
2. JRY మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్ -షాపు నెం.11 (General)	14,500/-	1,50,000/-	-	-
3. షాపు రూము- Opp. SBI Bank షాపు నెం.2 (General)	7,500/-	1,00,000/-	-	-
4. మటన్ షాపు రూములు-షాపు నెం.1 నుండి 4 వరకు (Shop Nos - General-1,3, SC-2, BC Rajaka-4)	5,100/-	50,000/-	-	-

షరతులు:

1. చిత్తూరు జిల్లా గెజిట్ నెం.04/2025, తేది:01.02.2025లోని షరతులకు బద్ధులై ఉండవలెను 2. బహిరంగ వేలములో హెచ్చు పాట ఖాయపరచబడును, లీజు అగ్రిమెంట్ హెచ్చు పాటదారుల సొంత ఖర్చులతో సబ్ రిజిష్టార్ ఆఫీస్ నందు రిజిష్టరు చేయించుకొని కాపీ మునిసిపల్ ఆఫీస్‌కు అందజేయవలెను. 3. బహిరంగ వేలము పాట వాయిదా వేయుటకు, నిరాకరించుటకు కమీషనర్ గారికి పూర్తి అధికారము కలదు. 4. ఒకరి తరఫున మరొకరు వేలము పాటలో పాల్గొనకూడదు. 5. హెచ్చు పాటదారులు ఏ నెల లీజు/బాడుగ అదే నెల 5వ తేదీలోగా చెల్లించవలెను. అట్లు చెల్లించని యెడల రూ.100/-కు రూ.2.50 చొప్పున అపరాధ రుసుము చెల్లించవలసి ఉండును. 6. పైతెలిపిన షాపు రూములలో ఐటమ్ 1కి గుడ్‌విల్ పైన, 2,3 మరియు 4లకి నెలసరి అద్దెపై వేలము నిర్వహించబడును. 7. పురపాలక సంఘమునకు ఇదివరలే బకాయి ఉన్న వారు మరియు వారి కుటుంబ సభ్యులు అనర్హులు.

గమనిక: ఇతర వివరములు ఈ కార్యాలయము పని వేళల యందు రెవిన్యూ ఇన్‌స్పెక్టర్, ఫోన్ నెం. 95829 33296 వారిని సంప్రదించవలెను.

సం/- కమిషనర్, పలమనేరు పురపాలక సంఘము

లోకాయుక్త ఫిర్యాదుపై ఆర్డీవో విచారణ


బాధితులతో మాట్లాడుతున్న ఆర్డీవో భవాని

వి.కోట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వి.కోట ప్రభుత్వ జూనియర్ కళాశాల నిమిత్తం భూములు కోల్పోయిన బాధితులు లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. దీనిపై పలమనేరు ఆర్డీవో భవాని బుధవారం విచారణ చేపట్టారు. స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి బాధితులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధితులు వారి వద్దనున్న ఆధారాలను ఆర్డీవోకు అందించి న్యాయం చేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో తహసీల్దారు పార్వతి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలకు ఆర్థిక సాయం


ఆర్థిక సహాయం చేస్తున్న జనసేన నేత వేణుగోపాల్‌రెడ్డి

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఆలయాల నిర్మాణాల కోసం జనసేన నాయకుడు, ఎన్వీఆర్ ట్రస్టు వ్యవస్థాపకుడు వేణుగోపాల్‌రెడ్డి ఆర్థిక సహాయం అందజేశారు. బుధవారం మండలంలోని చదళ్ల స్వగృహంలో పులిచెర్ల మండలం కురవపల్లెలో నిర్మిస్తున్న ఆలయానికి రూ.10 వేలు, పుంగనూరు పట్టణం శాంతినగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి రూ.10 వేలు, ముడిపాపనపల్లెలో నిర్మిస్తున్న ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి రూ.10వేలు, గుట్టకిందపల్లెలోని నిర్మిస్తున్న ఆలయానికి 50 బస్తాల సిమెంట్, మోదుగులపల్లె నారాయణప్పకు రూ.10 వేలు, అనారోగ్యంతో బాధపడుతున్న రేష్మాకు రూ.5 వేలు, సరస్వతమ్మకు రూ.5 వేలు, బీటెక్ విద్యార్థికి రూ.10 వేలు, విద్యార్థి భాగ్యమ్మకు రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా నిర్మిస్తున్న దేవాలయాలకు, అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిల్లో చికిత్సలు చేయించుకోలేని వారికి, పేద విద్యార్థులకు తనవంతుగా ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు తెలిపారు. ట్రస్టు సభ్యులు శివకుమార్‌రెడ్డి, నరేంద్రరెడ్డి, నారాయణరెడ్డి, జనసేన నాయకులు పగడాల రమణ, చిన్నరాయల్, సుబ్బు పాల్గొన్నారు.

గాయపడిన విద్యార్థినికి ఆర్థిక భరోసా

బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మురారిపల్లెకు చెందిన విద్యార్థిని భవ్యశ్రీ ఇటీవల రోడ్డుప్రమాదంలో గాయపడి ప్రస్తుతం బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం పొందుతోంది. దీంతో స్థానిక మునినారాయణ కళాశాల పూర్వవిద్యార్థులు రూ.30 వేలు ఆర్థికసాయాన్ని అందజేసినట్లు కళాశాల కరస్పాండెంట్ మహేష్ తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న భవ్యశ్రీ త్వరగా కోలుకోవడానికి దాతలు ఆర్థికసాయం అందించాలని కోరారు.

పంట కాలువ ఆక్రమణపై ఫిర్యాదు


తహసీల్దార్ రాముకు వినతిపత్రం అందిస్తున్న మహిళలు

పుంగనూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీమగానిపల్లె చెరువు రాజుకాలువను కొందరు ఆక్రమించారని బుధవారం తహసీల్దార్ రాముకు మహిళలు ఫిర్యాదు చేశారు. కొంతమంది రాజకీయ పలుకుబడి ఉన్న వ్యక్తులు కాలువలను ఆక్రమించి వారి పొలాల్లోకి కలుపుకోవడంతో సాగునీటి పారుదల ఆగిపోయిందన్నారు. దీంతో తమ పొలాలు సాగుకావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన తహసీల్దార్ పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

టీడీపీ వీరాభిమాని జయప్ప మృతి


జయప్ప కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం మణీంద్రంకు చెందిన టీడీపీ వీరాభిమాని జయప్ప బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. పార్టీ ఆవిర్భావం నుంచి జయప్ప టీడీపీ కార్యకర్తగా కొనసాగుతున్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి, పంచాయతీ అధ్యక్షుడు మంజునాథరెడ్డి, యూనిట్ ఇన్‌చార్జి వెంకటరమణ జయప్ప మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులకు పార్టీ తరపున రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో నేతలు శ్రీరాములురెడ్డి, జ్ఞానశేఖర్ రెడ్డి, చిరంజీవి, ఆదిల్, సురేష్, మోహన్, చంద్రశేఖర్‌రెడ్డి, మునస్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూటమితో కుప్పంలో అభివృద్ధి పరుగులు

● ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సురేష్ బాబు

శాంతిపురం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతో కుప్పం నియోజకవర్గంలో అభివృద్ధి పనులు పరుగులు తీస్తున్నాయని.. ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన నాయకుడు పోర్టల్‌ను పార్టీ కార్యాలయంలో ప్రారంభించారని ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబు, మండల టీడీపీ అధ్యక్షులు భాష్యం విశ్వనాథ్ నాయుడు అన్నారు. బుధవారం బాలాజీ కల్యాణ మండపంలో టీడీపీ మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం నియోజకవర్గాన్ని రాష్ట్రానికి ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నారన్నారు. ప్రతి కార్యకర్తను ఆర్థికంగా అభివృద్ధి పరిచేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో సీఎం వ్యక్తిగత కార్యదర్శి దుర్గాప్రసాద్, మండల టీడీపీ మాజీ అధ్యక్షులు విజయరామరెడ్డి, మాజీ ఎంపీపీ నందిగం ఉదయ్‌కుమార్, మండల టీడీపీ కార్యదర్శ పీవీ నాగరాజు, యూనిట్ ఇన్‌చార్జిలు ఆర్ఎస్ మణి, జయరామ్, గోపాల్, రుద్రప్ప, ఐటీడీపీ అధ్యక్షుడు రాజేంద్ర, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు అనసూయ, మండల మహిళా అధ్యక్షులు శ్యామల, మాజీ రెస్కో వైస్ చైర్మన్ చలపతి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు గుడుపల్లె మండల టీడీపీ సమావేశం

గుడుపల్లె: గుడుపల్లెలోని ప్రసన్న రాళ్లగంగమ్మ దేవాలయ కల్యాణ మండపంలో 13న గురువారం ఉదయం 10 గంటలక మండల టీడీపీ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు టీడీపీ మండలాధ్యక్షులు బాబునాయుడు తెలిపారు. సమావేశానికి నాయకులు, కార్యకర్తలు తప్పక హాజరుకావాలని కోరారు.

మసెమ్మ జాతర ప్రారంభం


పుష్పపల్లకిలో ఊరేగుతున్న మసెమ్మ

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరడిగుంట పంచాయతీ కొండచెర్ల కురప్పల్లె గ్రామస్తులు బుధవారం రాత్రి భక్తిశ్రద్ధలతో మసెమ్మజాతరను వైభవంగా ప్రారంభించారు. గ్రామ దేవతలైన కుంటి గంగమ్మ, ధనకుంట గంగమ్మ, బోయకొండ గంగమ్మ, నడివీధి గంగమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పుష్పపల్లకిలో మసెమ్మ అమ్మవారిని కొలువు తీర్చి గ్రామ వీధుల్లో ఊరేగించారు.

వేడుకగా సల్లాపురమ్మ జాతర


అమ్మవారికి బోణాలు చెల్లించడానికి వెళుతున్న మహిళలు

సోమల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దఉప్పరపల్లె పంచాయతీ వడ్డిపల్లె సమీపంలోని చీకలగుట్టపై కొలువు తీరిన సల్లాపురమ్మ జాతర వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి అమ్మవారికి నాగిళ్లవారిపల్లె గుత్తా మునెయ్యనాయుడు ఇంటి నుంచి శాస్త్రోక్తంగా సంప్రదాయంతో చీర, సారె ఊరేగింపుగా తీసుకెళ్లి సమర్పించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి మహిళలు పొంగళ్లతో ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. పల్లకిలో అమ్మవారిని పలు గ్రామాల్లో ఊరేగించారు.

వేదిక్ మ్యాథ్స్‌లో చరణ్ ప్రతిభ


చరణ్‌ను అభినందిస్తున్న బ్రహ్మర్షి పాఠశాల సిబ్బంది

పలమనేరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఈనెల 9న జరిగిన వేదిక్ మ్యాథ్స్ పోటీల్లో పలమనేరు బ్రహ్మర్షి పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుకుంటున్న చరణ్ రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సాధించాడు. జిల్లా స్థాయిలో జరిగిన వేదిక్ మ్యాథ్స్ పోటీల్లో పాల్గొని ప్రథమస్థానం సాధించిన చరణ్ విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపాడు. జాతీయ స్థాయిలో జరిగే పోటీలకు ఎంపిక కావడంతో బుధవారం పాఠశాల సిబ్బంది చరణ్‌ను అభినందించారు.

వైభవంగా వేణుగోపాలుడి రథోత్సవం


రథాన్ని లాగుతున్న భక్తులు

వి.కోట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వి.కోటలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి రథోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజు స్వామివారిని విశేషంగా అలంకరించారు. అనంతరం పీఎం రామూర్తి కుటుంబ సభ్యులచే ఉత్సవ విగ్రహాలను రథంపై కొలువుదీర్చారు. పట్టణ పురవీధుల్లో రథోత్సవం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త సీతారామయ్య, పీఎంఆర్ కుటుంబ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. సీఐ సోమశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పెద్దపురంలో ఘనంగా గంగజాతర


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపురం గ్రామంలో గంగ జాతర ఘనంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి అమ్మవారి శిరస్సు ఊరేగింపు వైభవంగా చేపట్టారు. బుధవారం ఉదయం అమ్మవారి విశ్వరూపదర్శనం ఏర్పాటుచేశారు. పరిసర గ్రామాల నుంచి పలువురు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్ గౌడు, టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రఘుచంద్రగుప్తా తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



కుప్పం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కుప్పం పట్టణం హెచ్‌పీ రోడ్డులో వెలసిన షిరిడీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. గణపతి హోమంతో ప్రారంభమైన పూజలు, సుదర్శన హోమం, మృత్యుంజయ హోమం, హయగ్రీవ హోమంతో ముగిశాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం బాబాకు ప్రాకారోత్సవం అత్యంత వైభవోపేతంగా జరిపారు. ఆలయ ధర్మకర్తలు భక్తులకు తీర్థ ప్రసాదాలు ఇచ్చారు.

పాడి ఆవుల చోరీ

సోమల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం కందూరు పరిసర గ్రామాల్లో ఐదు పాడి ఆవులను మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తీసుకెళ్లినట్లు బాధిత రైతులు తెలిపారు. ఊటుపల్లెలోని చంద్రారెడ్డికి చెందిన రెండు ఆవులు, తమ్మినాయనపల్లెలోని రత్నయ్యకు చెందిన ఓ ఆవు, కందూరులోని విజయకుమార్, పేగలవారిపల్లె ఆదెమ్మకు చెందిన ఆవులు చోరీ జరిగినట్లు బాధితులు వాపోయారు. ఒక్కో ఆవు రూ.70 వేలు విలువ చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సోమల పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు.

చోరీ దొంగల అరెస్టు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పాడిఆవుల చోరీకి పాల్పడిన దొంగను అరెస్ట్ చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం మండలంలోని సుగాలిమిట్ట వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పాడిఆవులతో లగేజీ ఆటో అనుమానంగా కనిపించిందని.. విచారిస్తుండగా ఇద్దరు పరారీ కావడంతో కర్ణాటక రాష్ట్రం బొమ్మనహళ్లి గ్రామానికి చెందిన అన్వర్‌ఖాన్(41) పట్టుబడినట్లు పేర్కొన్నారు. పరారైన సుల్తాన్, కాలేషాలు అదే గ్రామానికి చెందిన వారుగా గుర్తించారు. వీరు పలమనేరు, వి.కోట, పుంగనూరు తదితర ప్రాంతాల్లో పాడి ఆవులను చోరీ చేసి కర్ణాటకలో విక్రయిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పురుగులమందు తాగి రైతు మృతి

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మదనపల్లెకు చెందిన ఓ వ్యక్తి పురుగులమందు తాగి పుంగనూరు మండలం ఈడిగపల్లె వద్ద మృతి చెందిన సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. సీఐ శ్రీనివాసులు కథనం మేరకు.. మదనపల్లె సమీపంలో ఎగువకురవంక గ్రామానికి చెందిన చిన్నప్ప(71)కు పుంగనూరు మండలం ఈడిగపల్లె వద్ద వ్యవసాయ పొలాలు ఉన్నాయి. మంగళవారం సాయంత్రం చిన్నప్ప పొలం వద్ద పురుగుల మందు తాగి పడిపోవడంతో రైతులు గుర్తించి మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాత కేసుల్లో నిందితుడి అరెస్టు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక మద్యం తరలింపు కేసుల్లో నిందితుడిగా ఉన్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని ఎన్ఎస్‌పేటకు చెందిన అల్తాఫ్ కుమారుడు అబ్రార్(30) కర్ణాటక మద్యం కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. బుధవారం పట్టణంలో తిరుగుతుండగా అరెస్టు చేసి రిమాండుకు పంపారు.

మిరప పంటకు తెగులు


తుప్పిరెడ్డిగారిపల్లెలో తెగులు సోకిన మిరప పంట

రొంపిచెర్ల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిచ్చిలివారిపల్లె పంచాయతీ తుప్పిరెడ్డిగారిపల్లె గ్రామానికి చెందిన రైతు చక్రపాణిరెడ్డి పొలంలో మిరప పంటకు అంతుపట్టని తెగులు సోకి పంట నష్టం వాటిల్లింది. మిరప నారు తెచ్చి బిందుసేద్యంతో మిరపసాగు చేశారు. అయితే పంట చేతికి వచ్చే సమయానికి తెగులు సోకి పంట దిగుబడులు రాక రైతు నష్టపోయారు. వ్యవసాయంపై ఆధారపడిన రైతు తనకున్న పొలంలో వరి, మిరప పంటలు సాగు చేశారు. అయితే మిరపకు తెగులు సోకడంతో నష్టపోయానని రైతు వాపోయారు.

కనులపండువగా కాళభైరేశ్వరస్వామి కల్యాణోత్సవం


కాళభైరేశ్వరస్వామి కల్యాణోత్సవంలో గ్రామస్తులు

బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుప్పనపల్లెలో కాళభైరేశ్వరస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా స్వామివారి కల్యాణోత్సవం బుధవారం కనులపండువగా జరిగింది. ఈ సందర్భంగా అర్చకులు మురళీధరాచార్యులు, శంకరశర్మ స్వామివారి మూలవర్లకు అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గాయత్రి, సుభాష్, కృష్ణప్ప, రఘుగౌడు, మునేగౌడు, సంతోష్, పంచమూర్తి, సుబ్రహ్మణ్యం, ప్రభాకర్, మురళీగౌడు ఉభయదారులుగా వ్యవహరించారు.

రైతుల పేర్ల నమోదు

రొంపిచెర్ల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రాష్ట్రంలోని ప్రతి రైతుకు ఓ విశిష్ట గుర్తింపు సంఖ్య (రైతు డిజిటల్ గుర్తింపు కార్డు) ఇవ్వాలని నిర్ణయించాయని.. ప్రతి రైతు సేవా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకులతో తమ పేర్లను ఫార్మర్స్ రిజిస్ట్రీ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి సుధారాణి తెలిపారు. ఈనెల 28 లోపు రైతులు రైతు సేవా కేంద్రాల్లో పేర్లను నమోదు చేసుకోవచ్చన్నారు. రైతులందరూ తప్పనిసరిగా పేర్లను నమోదు చేసుకుని విశిష్ట గుర్తింపు సంఖ్య పొందాలని కోరారు.

రాజీమార్గంలో కేసులకు పరిష్కారం

8న జాతీయ లోక్ అదాలత్


పలమనేరులో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భారతి


కుప్పంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి భారతి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి వరుణ్ తేజ్


పుంగనూరులో మాట్లాడుతున్న న్యాయమూర్తి ఎస్.ఆరీఫా

పలమనేరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పలమనేరు కోర్టు పరిధిలోని సివిల్, క్రిమినల్ కేసులను లోక్ అదాలత్‌లో రాజీ మార్గంతో పరిష్కరించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ భారతి కోరారు. వచ్చేనెల 8న జరుగనున్న జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా బుధవారం పలమనేరు కోర్టులో సమావేశం నిర్వహించారు. సమావేశంలో పలమనేరు సీనియర్ సివిల్ జడ్జి ఆదినారాయణ, జూనియర్ సివిల్ జడ్జి లిఖిత, పలమనేరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ లక్ష్మీపతి, సీనియర్ న్యాయవాదులు పరమశివప్ప, ఏపీపీ విష్ణువర్ధన్‌రెడ్డి, గంగవరం సీఐ ప్రసాద్, బ్యాంకు మేనేజర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

● కుప్పం: లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా న్యాయవాదులు, పోలీసు అధికారులు అవగాహన కల్పించాలని జిల్లా న్యాయ సేవా సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎం.ఎస్. భారతి, కుప్పం అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి పి.వరుణ్ అన్నారు. కుప్పం కోర్టు ఆవరణలో బుధవారం లోక్ అదాలత్‌పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జిలు మాట్లాడుతూ మార్చి 8వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు చెప్పారు. కోర్టు పరిధిలోని క్రిమినల్, సివిల్ తదితర కేసుల్లో కక్షిదారులు రాజీ చేసుకునేలా న్యాయవాదులు, పోలీసు అధికారులు చైతన్యం కలిగించాలని సూచించారు. రాజీ పడటంతో విలువైన సమయంతోపాటు డబ్బులు మిగులుతాయన్నారు. కార్యక్రమంలో కుప్పం డీఎస్పీ పార్థసారథి, కుప్పం రూరల్ సీఐ మల్లేశ్‌యాదవ్, ఎక్సైజ్ సీఐ నాగరాజు, కోర్టు ఏపీపీ, ఎస్ఐలు కోర్టు కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

● పుంగనూరు: వచ్చేనెల 8న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్.ఆరీఫా కోరారు. బుధవారం కోర్టు ఆవరణలో న్యాయవాదులు, పోలీస్, రెవెన్యూ అధికారుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాజీకి అనువైన సివిల్, క్రిమినల్ కేసులను రాజీ చేసుకోవాలని కోరారు. న్యాయవాదులు, పోలీసులు కలిసి రాజీ చేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. సమావేశంలో న్యాయమూర్తి కృష్ణవంశీ, న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు చెన్నకేశవులు, సీఐ శ్రీనివాసులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

పాత బస్టాండ్‌ను పునరుద్ధరించాలి

● దుకాణదారుల నిరసన



చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పాత బస్టాండ్‌ను పునరుద్ధరించాలని పాత బస్టాండు షాప్ కీపర్స్ అసోసియేషన్ నాయకులు, దుకాణదారులు డిమాండ్ చేశారు. తమ కడుపుకొట్టొదంటూ బుధవారం పాత బస్టాండులో నిరసన తెలిపారు. 1956లో ఇక్కడ గుడిసెలు వేసుకుని ముందుభాగంలో వ్యాపారం చేసుకుని.. వెనుకభాగంలో కాపురాలు ఉండేవారన్నారు. 1975లో మున్సిపాలిటీవారు షాపులను బాడుగకు ఇచ్చారన్నారు. 1996లో మున్సిపాలిటీ నిర్ణయించిన ధరను చెల్లించి షాపులను నడుపుతున్నవారే కొనుక్కున్నారని తెలిపారు. ఇపుడు పేదల సొత్తును ధనవంతులకు ధారాదత్తం చేయాలనే ఉద్దేశంతోనే ఇలా చేస్తున్నారని ఆరోపించారు. బస్టాండును మూసేయడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామన్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు పునరాలోచించి పాత బస్టాండును యథాతథంగా ఉంచాలని కోరారు.

కంప్యూటర్లు, ఫ్యాన్లు రిపేరు చేయిస్తాం

● జడ్పీ సీఈవో, డీఎల్‌పీవో



ఎంపీడీవో కార్యాలయాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఐరాల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఇటీవల 11 కేవీ విద్యుత్ లైన్‌పై తొండపడి తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైన కంప్యూటర్లు, ఫ్యాన్లు తదితరాలను రిపేరు చేయిస్తామని జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు, డీఎల్‌పీవో రవికుమార్ అన్నారు. బుధవారం వారు ఐరాల ఎంపీడీవో కార్యాలయాన్ని పరిశీలించారు. కార్యాలయంలో కాలిపోయిన కంప్యూటర్లు, ఫ్యాన్లు, ప్రింటర్లను పంపిస్తే, రెండ్రోజుల్లో రిపేయి చేయిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏవో భువనేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

పాడి రైతులు మెలకువలు పాటించాలి: జేడీ



సమావేశంలో ప్రసంగిస్తున్న ప్రభాకర్

యాదమరి, ఫిబ్రవరి 12 (ఆంధ్ర జ్యోతి): పాడి పరిశ్రవం రైతులు మెలకువలను పాటించాలని, అపుడే అధిక పాల ఉత్పత్తి పొందవచ్చని జేడీ ప్రభాకర్ సూచించారు. కుక్కలపల్లె పంచాయతీ లక్ష్మయ్య కండ్రిగలో సంకరజాతి పేయదూడల ప్రదర్శనకు హాజరయ్యారు. నాణ్యమైన పేయదూడలకుగాను పాడి రైతులు సుబ్రహ్మణ్యం నాయుడు, మునస్వామి నాయుడికి బహుమతులు అందజేశారు. డీడీలు డాక్టర్ వాసు, ఆరీఫ్, పశుసంవర్ధక శాఖ వైద్యులు ఆదిత్య, డాక్టర్ సంధ్య పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యూపీసీల్లో డీఎల్పీవో తనిఖీలు

పూతలపట్టు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వావిల్‌తోట, వడ్డేపల్లె, చిటిపిరాళ్ల గ్రామాల్లో ఉన్న ఎస్‌డబ్ల్యూపీసీలను డీఎల్పీవో పార్వతి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని 15 పంచాయతీల్లోని ఎస్‌డబ్ల్యూపీసీలో వర్మి కంపోస్టు తయారీకి అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. ఈవోఆర్డీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

భూ సర్వేని పకడ్బందీగా చేయాలి

అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ



సిబ్బందితో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ

తవణంపల్లె, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): భూ సర్వేని పకడ్బందీగా చేయాలని రెవెన్యూ సిబ్బందిని అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ ఆదేశించారు. బుధవారం చెర్లోపల్లెలో జరుగుతున్న సర్వేను ఆర్డీవో శ్రీనువాసులుతో కలిసి పరిశీలించారు. అనంతరం తవణంపల్లె తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీవో తనిఖీ చేశారు. పెండింగ్‌లో ఉన్న అర్జీలను వారంలోపు పరిష్కరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. తహసీల్దార్ సుధాకర్, డీటీ వెంకటరమణ, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

గడువులోగా పూర్తిచేయండి: ఆర్డీవో

నింద్ర: మండలంలో నిర్వహిస్తున్న భూసర్వేను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని నగరి ఆర్డీవో భవానీ శంకరి అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని గ్రామ రెవెన్యూ అధికారులు, సచివాలయ సర్వేయలతో సమీక్షించారు. తహసీల్దార్ శేషగిరిరావు, సర్వేయర్, ఆర్ఐ పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధి నివారణకు కృషి చేద్దాం



సమావేశంలో ప్రసంగిస్తున్న వెంకట్ ప్రసాద్

శ్రీరంగరాజుపురం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కుష్ఠు వ్యాధి నివారణకు కృషి చేద్దామని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ వెంకట్ ప్రసాద్ పిలుపునిచ్చారు. బుధవారం ఎస్ఆర్‌పురం పీహెచ్‌సీ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రసంగించారు. కుష్ఠు వ్యాధిగ్రస్తులకు రిటైర్డ్ డీపీవో యువరాజు, శంకరమ్మ దంపతుల వితరణతో దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. డీపీవో కానిక్‌రాజ్ భోజన సదుపాయం కల్పించారు. వైద్యాధికారులు గిరిధర్‌రెడ్డి, బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, డీపీఎంవో జన్, సూపర్‌వైజర్లు గంగాదేవి, శ్రీనివాసులురెడ్డి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఎంప్లాయిమెంట్ ఆఫీస్ (ప్రభుత్వ ఐటీఐ పక్కన) శుక్రవారం ఉదయం పది గంటలకు జాబ్‌మేళా జరగనుంది. ఈ మేరకు వెలుగు ఏపీఎం ఫరీద్‌మస్తాన్, జాబ్‌మేళా నిర్వాహకులు రూపేష్, లోకేష్, కృష్ణయ్య ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, సొసైటీఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజస్ డెవలప్‌మెంట్‌ల సహకారంతో జాబ్ మేళా జరుగుతుందన్నారు. కోటక్ గ్రూప్‌లో బీఎస్ఎస్ మైక్రోఫైనాన్స్‌లో కలెక్షన్ ఆఫీసర్ 50 ఉద్యోగాలు ఉన్నాయి. టెన్త్ నుంచి డిగ్రీ వరకు చదివిన 18-32 ఏళ్లలోపు యువకులు అర్హులు. మెడ్‌ప్లస్ మెడికల్ స్టోర్స్‌లో ఫార్మసీ ట్రైనీ ఉద్యోగాలు 50 ఉన్నాయి. టెన్త్ నుంచి డిగ్రీ వరకు చదివిన 18-30 ఏళ్లలోపు యువకులు అర్హులు. మూడు ఫార్మసీ అసిస్టెంట్ ఉద్యోగాలకు ఎనీ ఫార్మసీ చదివిన, 21-30 ఏళ్లలోపు యువతీ, యువకులు అర్హులు. కేవీఆర్ జ్యువెలర్స్‌లో కంప్యూటర్ ఆపరేటర్, సేల్స్ కోసం 10 ఉద్యోగాలు ఉన్నాయి. దీనికి ఇంటర్ నుంచి డిగ్రీ వరకు చదివిన 18-35 ఏళ్లలోపు యువతీ, యువకులు అర్హులు.

విద్యుత్ తీగలు తగిలి కంటైనర్ పాక్షికంగా దగ్ధం



మంటల్లో కంటైనర్

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగలు తగలడంతో మంటలు చెలరేగి, ఆగి ఉన్న కంటైనర్ పాక్షికంగా దగ్ధమైంది. ఈ ఘటన మంగళవారం రాత్రి మహాసముద్రం టోల్‌ప్లాజా వద్ద జరిగింది. పెనుగొండ నుంచి చెన్నైకి కియా కార్లకు చెందిన విడిభాగాలు ఓ కంటైనర్‌లో తీసుకెళుతున్నారు. మహాసముద్రం టోల్‌ప్లాజా వద్దకొచ్చేసరికి వాహనాన్ని దాని డ్రైవర్ ఉదయ్‌కుమార్ ఓ పక్కకు ఆగి టీ తాగడానికి వెళ్లాడు. ఈ సమయంలో అక్కడున్న విద్యుత్ వైర్లు కంటైనర్‌కు తగలడంతో వెనుక టైర్లలో మంటలు చెలరేగాయి. గమనించిన డ్రైవర్, టోల్‌ప్లాజా సిబ్బంది కలిసి మంటలను ఆర్పడానికి ప్రయత్నించారు. అదుపులోకి రాకపోవడంతో బంగారుపాళ్యం పోలీసులకు, చిత్తూరు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారొచ్చి మంటలను అదుపు చేశారు.

నూతన బోరు డ్రిల్లింగ్

వెదురుకుప్పం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): టీకేఎంపురంలో తాగునీటి కొరత ఉండటంతో నూతనంగా బోరుడ్రిల్లింగ్ చేయించారు. సమృద్ధిగా నీళ్లుపడ్డాయని టీకేఎంపురం సర్పంచ్ లక్ష్మి బుధవారం తెలిపారు.

సంక్షిప్తంగా..

కంటి అద్దాల పంపిణీ

యాదమరి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 14 కండ్రిగ ఉన్నత పాఠశాల విద్యార్థులకు జిల్లా అంధత్వ నివారణ బృందం ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన విద్యార్థులకు కంటి అద్దాలను టీడీపీ అధికార ప్రతినిధి వల్లేరు అమర్‌నాథ నాయుడు, హెచ్ఎం భాస్కర్‌రావు, మునీర్ బుధవారం పంపిణీ చేశారు.

నేడు మహాకుంభాభిషేకం

పూతలపట్టు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పి.కొత్తకోట పంచాయతీ కొత్తవెంకటాపురంలో నూతనంగా నిర్మించిన బాల వినాయక స్వామి, బాలసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ మహాకుంబాభిషేకం గురువారం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి పూతలపట్టు, చంద్రగిరి ఎమ్మెల్యేలు హాజరవుతారని నిర్వాహకులు పేర్కొన్నారు.

వైసీపీ చిత్తూరు నగరాధ్యక్షుడిగా శ్రీధర్



చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ చిత్తూరు నగరాధ్యక్షుడిగా కేపీ శ్రీధర్‌ను నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

16న రుద్రాభిషేకం

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కామాక్షి అంబికా సమేత అగస్తీశ్వరాలయంలో ఈనెల 16వ తేదీన స్వామివారికి సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో రుద్రాభిషేకం నిర్వహించనున్నారు. ఈ మేరకు సమితి నిర్వాహకుడు మధుసూదనం తెలిపారు. దీనికి సంబంధించిన ఫ్లెక్సీలను బుధవారం గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో ఆవిష్కరించారు. కాగా, సమితి నగర కన్వీనర్‌గా ఉన్న శేషనారాయణను బెంగళూరుకు బదిలీ చేశారు. కొంగారెడ్డిపల్లె శాఖ నిర్వాహకుడు ప్రభాకర్‌నాయుడు నూతన కన్వీనర్‌గా బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

లోకోస్ యాప్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని స్వయం సహాయక సంఘాలు వారు లోకోస్ యాప్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీ శ్రీదేవి అన్నారు. బుధవారం జిల్లా సమాఖ్య సమావేశ మందిరంలో జిల్లాలోని అకౌంటెంట్ల సమావేశం జరిగింది. డీపీఎం సుబ్బారెడ్డి, ఏపీఎంలు, సభ్యులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి: డీఎస్పీ

వెదురుకుప్పం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): సత్ప్రవర్తనతో మెలగాలని నగరి డీఎస్పీ అజీజ్ తెలిపారు. బుధవారం కార్వేటినగరం సీఐ కార్యాలయం వద్ద రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. నేరాలకు దూరంగా ఉంటే కేసు మాఫీ చేసే అవకాశం ఉంటుందని చెప్పారు. కార్వేటినగరం సీఐ హనుమంతప్ప, ఎస్ఐలు పాల్గొన్నారు.

24నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు

తవణంపల్లె, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కాళభైరేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 24 నుంచి మార్చి 2వ తేదీవరకు మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన ఆహ్వాన పత్రికను బుధవారం గ్రామస్తుల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఆహ్వాన పత్రిక విరాళదాత కుమార్ చౌదరి, గ్రామస్తులు వినాయక, శరవణ, తులసి, కుమార్, కృష్ణమూర్తి, రామ్ కుమార్, వినాయకం, పురుషోత్తం, సదాశివ శెట్టి, మోహన్ వేలు తదితరులు పాల్గొన్నారు.

కమనీయంగా కల్యాణోత్సవం



తాళిబొట్టును చూపుతున్న అర్చకుడు

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మొగిలీశ్వరస్వామి ఆలయానికి అనుబంధంగా దేవరకొండపై ఉన్న పార్వతీ సమేత జలకంఠేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం బుధవారం కమనీంగా జరిగింది. పౌర్ణమిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కల్యాణోత్సవంలో భక్తులకు అన్నదానం చేశారు. అర్చకులు శ్రీనివాస శర్మ, ఆలయ పర్యవేక్షకుడు కుమార్ పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం: బంగారుపాళ్యం గ్రామదేవత ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం బుధవారం నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. సర్పంచ్ ఉమాదేవి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వీఆర్వో సంతకం ఫోర్జరీపై కేసు నమోదు

వెదురుకుప్పం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం ఆళ్లమడుగు వీఆర్వో కె.హేమాద్రిరెడ్డి సంతకం ఫోర్జరీపై కేసు నమోదైంది. దాసరికాలనీకి చెందిన బి.నారాయణరెడ్డి ఆళ్లమడుగు రెవెన్యూ లెక్కదాఖలు సర్వే నెంబరు 165లో 280 చదరపు గజాల భూమికి అనుభవ పత్రం తయారీ చేశారు. ఈ క్రమంలో తన సంతకం ఫోర్జరీ చేసి, సీలు వేశారని ఆళ్లమడుగు వీఆర్వో కె.హేమాద్రిరెడ్డి ఫిర్యాదు చేశారు.

సారా ఊట ధ్వంసం

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 770 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశారు. బుధవారం బంగారుపాళ్యం మండలం కేజీ సత్రం సమీపంలోని అటవీ ప్రాంతంలో ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 20 డ్రమ్ముల్లోని సుమారు 770 లీటర్ల సారా ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ దాడుల్లో సీఐ పవన్ కుమార్, ఎస్ఐ సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

బోల్తాపడ్డ కంటైనర్

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): చెన్నై- బెంగళూరు జాతీయ రహదారి మొగిలి సమీపంలోని శ్రీనిఫుడ్ పార్క్ వద్ద బుధవారం ఓ కంటైనర్ అదుపు తప్పి బోల్తాపడింది. బ్యాటరీల లోడుతో బెంగళూరు నుంచి పాట్నాకు వెళుతున్న కంటైనర్ మొగిలి ఘాట్‌లోకి రాగానే అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కంటైనర్ డ్రైవర్ విక్రమ్ సురక్షితంగా బయటపడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

రెండు గ్రావెల్ టిప్పర్ల సీజ్

పాలసముద్రం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న రెండు టిప్పర్లను నగిరి డీఎస్పీ మహ్మద్‌అజీజ్ సీజ్ చేశారు. మంగళవారం అర్ధరాత్రి పాలసముద్రం మండలంలోని నరసింహాపురంలో నిర్వహించిన పోలీసుల పల్లెనిద్ర కార్యక్రమంలో పాల్గొని డీఎస్పీ తిరిగి బయల్దేరారు. వనదుర్గాపురం అటవీప్రాంత నుంచి తమిళనాడుకు రెండు టిప్పర్ల ద్వారా గ్రావెల్‌ను తరలిస్తుండగా రికార్డులు తనిఖీ చేశారు. వారివద్ద ఎలాంటి బిల్లులు, అనుమతి పత్రాలు లేకపోవడంతో వాహనాలను సీజ్‌చేసి, పాలసముద్రం పోలీసులకు అప్పగించారు. ఎస్ఐ చిన్నరెడ్డెప్ప కేసు నమోదు చేసి.. మైన్స్ శాఖకు అప్పగించారు.

ధాన్యం తరలిస్తున్న మినీ లారీ బోల్తా

వెదురుకుప్పం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం-దేవళంపేట రహదారి మార్గంలో పోలీసుస్టేషన్‌కు కూత వేటు దూరంలో ధాన్యం తరలిస్తున్న మినీ లారీ బుధవారం అదుపు తప్పి బోల్తాపడింది. దీంతో వాహనంలోని బస్తాలు కిందపడ్డాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

పాఠశాలలు, పీహెచ్‌సీలో తనిఖీలు

తవణంపల్లె, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): అరగొండ బాలురు, బాలికల పాఠశాలలను, తవణంపల్లె పీహెచ్‌సీని, టి.పుత్తూరు, అరగొండ అంగన్వాడీ కేంద్రాలను మండల ప్రత్యేకాధికారి బాలాజీ బుధవారం తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని, పారిశుధ్యం పనులు పరిశీలించారు. ఎంపీడీవో రెడ్డిబాబు, సీడీపీవో నిర్మల, అంగన్వాడీ సిబ్బంది, టీచర్లు పాల్గొన్నారు.

కొబ్బరి అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేసుకోండి



సమావేశంలో ప్రసంగిస్తున్న కృష్ణమహేష్‌రెడ్డి

పాలసముద్రం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొబ్బరి రైతులు అనుబంధ పరిశ్రమలను ఏర్పాటు చేసుకోవాలని ఎంపీడీవో కృష్ణమహేష్‌రెడ్డి కోరారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో రాజమండ్రి కాయర్ బోర్డు వారి సౌజన్యంతో రూరల్ యాక్షన్ సంస్థ ఆధ్వర్యంలో కొబ్బరి పీచుతో అనుబంధ ఉత్పత్తులు తయారు చేయడానికి మహిళలకు మూడ్రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కాయర్ బోర్డు రీజినల్ అధికారి దుర్గాదాస్ మాట్లాడుతూ.. కొబ్బరి పీచుతో డోర్ మ్యాట్లు, తాళ్లు, కొబ్బకి పీచు బ్రష్‌లపై మహిళలకు అవగాహన కల్పించారు. వీటికి అవసరమైన యంత్రాలను సబ్సిడీపై అందిస్తామన్నారు. ఎంపీపీ శ్యామలా శివప్రకాష్‌రాజు, డీటీ రిషివర్మ, రూరల్ యాక్షన్ సంస్థ అధ్యక్షుడు చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ పోటీల్లో పీఈఎస్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ



జశ్వంత్, సాయి ప్రణీశ్వర్, కృతిన్, పృథ్వి →

యాదమరి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో ఈనెల 8 నుంచి 11వ తేదీవరకు జరిగిన రాష్ట్రస్థాయిల అండర్-16 యూత్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పీఈఎస్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. పదో తరగతి విద్యార్థులు జశ్వంత్, సాయి ప్రణీశ్వర్, కృతిన్, పృథ్వీలు బాలుర విభాగంలో మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను, పీఈటీలను ప్రిన్సిపాల్ వైవీ కృష్ణబాబు బుధవారం అభినందించారు.

కాణిపాకంలో భక్తిశ్రద్ధలతో సత్యనారాయణస్వామి వ్రతం



ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న వరదరాజస్వామి గుడిలో బుధవారం ఉదయం సత్యనారాయణ స్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో వరదరాజస్వామి మూల విరాట్‌కు అభిషేకం చేసి, భక్తులకు దర్శన భాగ్యంకల్పించారు. ఆలయ ప్రాంగణంలో సత్యనారాయణ స్వామి చిత్రపటాన్ని ఉంచి భక్తుల చేత వ్రతాన్ని నిర్వహింపజేశారు. ఈ కార్యక్రమంలో ఈవో పెంచలకిషోర్, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు తదితరులు పాల్గొన్నారు.

అర్ధగిరిలో పౌర్ణమి వేడుకలు

తవణంపల్లె, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్య క్షేత్రం అర్ధగిరి వీరాంజనేయస్వామి ఆలయంలో బుధవారం పౌర్ణమి వేడుకలు జరిగాయి. ఆలయ ప్రధానార్చకుడు వేణుగోపాలాచార్యుల ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సుదర్శన హోమం నిర్వహించాక భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం స్వామివారి ఉత్సవర్లను అలంకరించి, ప్రాకారోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తుల కాలక్షేపం నిమిత్తం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీరామ నామక్షేత్రంలో..

విజయపురం: జగన్నాథపురంలోని శ్రీరామనామ క్షేత్రంలో పౌర్ణమి పూజలు బుధవారం నిర్వహించారు. సీతారాములకు ఉదయం అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వాహకుడు రాంప్రసాద్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు.

వసంత పౌర్ణమి పూజలు



పూజల్లో పాల్గొన్న నిర్వాహకులు

చిత్తూరు కల్చరల్: గిరింపేట చెంగల్రాయ కొండ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో బుధవారం వసంత పౌర్ణమి పూజలు వైభవంగా జరిగాయి. అనంతరం ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక రథంపై అధిష్ఠించి, గిరి ప్రదక్షిణ నిర్వహించారు. ఆలయ ఈవో సుబ్బారెడ్డి, అర్చకులు, ఉత్సవ నిర్వాహకుడు పూల సుబ్రహ్మణ్యం నాయుడు, భక్తులు పాల్గొన్నారు. గిరింపేట శివగామి సుందరి సమేత చిదంబరేశ్వర ఆలయం, సత్యసాయి సంస్థాన్‌లో పూజలు జరిగాయి.

'జేఈఈ మెయిన్స్'లో ప్రైవేటు విద్యార్థుల ప్రతిభ

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ సెషన్-1 ఫలితాల్లో పలు ప్రైవేటు విద్యాసంస్థల విద్యార్థులు ప్రతిభ చూపారు. బుధవారం విద్యార్థులను ఆయా యాజమాన్యాలు అభినందించాయి.

విజయం జూనియర్ కళాశాలలో..

విజయం జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ పర్సంటైల్‌తో ప్రతిభ చూపినట్లు విజయం విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి తెలిపారు. జె.గగన సాయి 92 పర్సంటైల్‌తో మొదటి స్థానంలో, కె.పవన్ సాయి 85 పర్సంటైల్‌తో రెండో స్థానంలో నిలిచారన్నారు. 10 మందికిపైగా విద్యార్థులు 80కి పైగా పర్సంటైల్ సాధించినట్లు వివరించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్ శైలజామూర్తి, అధ్యాపకులతో కలిసి అభినందించారు.




గగనసాయి - పవన్ సాయి

పీఎస్ఎన్ శ్రీవివేకానంద జూనియర్ కళాశాలలో..



పీఎస్ఎన్ శ్రీవివేకానంద జూనియర్ కళాశాల విద్యార్థులు టాపర్లుగా నిలినట్లు అధినేత పీఎస్ సత్యనారాయణ తెలిపారు. పి.యోషిత్ సాయి 96.03 పర్సంటైల్‌తో నగరంలో టాపర్‌గా నిలవగా, పి.అనీష్ (95.86), డి.స్నేహ (95.72) పర్సంటైల్ సాధించినట్లు తెలిపారు. పవన్‌కళ్యాణ్ (94.25), పి.సాయితీ (93.15), ఎం.గణేష్ (92.78), కె.తేజరెడ్డి (95.59), పి.దిలీప్‌కుమార్ (92.10), వినిత్ (91.93), ఆర్.మాన్యతరెడ్డి (91.21), ఎం.జేష్నా (90.85), కె.మహితకీర్తి (90.66), కె.లలిత (89.72), రెడ్డిచార్విత (89.47), టీవీ హాసిని (89.33)లు పర్సంటైల్ సాధించినట్లు వివరించారు. విద్యార్థులను బుధవారం కళాశాల ప్రాంగణంలో ప్రిన్సిపాల్ నాగరాజశెట్టి, అధ్యాపకులతో కలిసి అభినందించారు.

శ్రీవివేకానంద జూనియర్ కళాశాలలో..

శ్రీవివేకానంద జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తాచాటినట్లు నిర్వాహకులు భాస్కర్‌నాయుడు, మహేంద్రకుమార్ తెలిపారు. కె.తరుణ్‌కుమార్ 96.19 పర్సంటైల్ సాధించారన్నారు. అలాగే పి.బాలు (95.97), డి.లక్ష్య (95.87), కె.హేమేశ్వర్ (95.70), ఎం.సంతోష్ (95.45), కె.రాకేష్ (92.18), ఎం.సందీప్ (91.43), జి.కావ్య (90.52) పర్సంటైల్ సాధించగా, మరో 63 మంది అర్హత సాధించినట్లు తెలిపారు. వీరిని అధ్యాపకులతో కలిసి అభినందించారు.